నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
మంగళవారం 21 జనవరి 2025 www.navatelangana.com

సారవంత భూములు నిమ్జ్‌కు ఇవ్వబోం

నవతెలంగాణ-న్యాల్‌కల్



సారవంతమైన తమ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ నిమ్జ్‌కు ఇవ్వబోమని పలు గ్రామాల ప్రజలు కలెక్టరేట్‌లో సోమవారం జరిగి న ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. హద న్నూర్ గ్రామంలో భూ సేకరణలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని నోటిఫికేషన్ విడుదల కావడం తో.. సదరు గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దార్ కార్యా లయంలో వినతి పత్రాలు అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. చెరకు, అల్లం, పసుపు, చిరుధాన్యాలు పండించే సాగు భూమలు ఎలా తీసుకుంటా రని ప్రశ్నించారు. జీవనాధారంగా ఉన్న తమ భూములను మాత్రం ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో హద్నూర్ గ్రామ రైతులు షబ్బీర్ ఖాన్, జైపాల్ రెడ్డి, నర్సారెడ్డి, మహేష్, రవీందర్, మల్లప్ప, ఆనంద్ రెడ్డి, తదితరులున్నారు.

కులవృత్తుల వారిని అభివృద్ధి చేస్తాం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ఎస్‌ఐడిబిఐ, ఏపీఎంఎస్, కేవీఐసిల సహకారంతో నారాయణ ఖేడ్ బ్లాక్‌లో కుమ్మరి కళాకారులను గుర్తించి వారికి నూతన పద్ధతిలో లాభసాటిగా ఉండేటట్టు శిక్షణ ఇచ్చి పనిముట్లు, సర్టిఫికెట్‌లను ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి సోమవారం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తుల అభివృద్ధి కోసం 20 యూనిట్లు కేటాయించామన్నారు. సంజీవన్‌రావుపెట్ గ్రామానికి 10 యూనిట్లు, నిజాంపెట్ గ్రామానికి 10 యూనిట్లు కేటాయించి.. లబ్దిదారులకు అందించడం జరిగిం దన్నారు. అనంతరం 108 నూతన అంబులెన్స్‌ను నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి మాజీ ఎంపీటీసీ, రాధ కిషన్ సెట్, రాజు, శంకర్, కుమ్మరి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

పటాన్‌చెరుకు చెందిన దంపతులు మృతి
.. చిన్నారికి తీవ్ర గాయాలు
మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు
అన్నమయ్య జిల్లాలో ఘటన



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రైల్వే కోడూర్ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పటాన్‌చెరుకు చెందిన భార్యాభర్తలు ఘటన స్థలంలోనే మృతి చెందా రు. వారి పెద్ద కూతు రుకు తీవ్ర గాయాలు కాగా కొడుకు, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్చెరు పట్టణంలోని సీతారామపురానికి చెందిన సందీప్ షా(45) కుటుంబంతో కలిసి మూడ్రోజుల క్రితం కారులో తిరుపతికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రైల్వే కోడూర్ సమీపంలోని కుక్కలదొడ్డి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు బలంగా వారి కారును ఢీకొట్టింది. కారు నడుపుతున్న సందీ ప్ షా, అతని భార్య అంజలీదేవి(40) అక్కడికక్కడే మృతి చెందారు. వారి పెద్ద కూతురుకు తీవ్ర గాయాలవ్వగా కొడు కు, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డ చిన్నారులను తిరుపతి ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

దంపతుల మృతి పట్ల పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిని ఘటనా స్థలానికి పంపించినట్టు తెలిపారు. ప్రమా దంలో షా పెద్ద కూతురు తీవ్రంగా గాయపడి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నదన్నారు. చిన్న కూతురు, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారన్నారు. గత 25ఏండ్లుగా తన కుటుంబంలో ఒక సభ్యుడిగా మెలుగుతూ అనునిత్యం ఉత్తర భారతీయుల సంక్షేమం కోసం తపన పడే వాడని ఆవేదన వ్యక్తం చేశారు. షా మరణం వ్యక్తిగతంగా తనకు తీరని లోటని భావోద్వేగానికి గురయ్యారు. వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ తమ కుటుంబం అండగా నిలుస్తుందన్నారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్ధిదారుల ధర్నా



నవతెలంగాణ-గజ్వేల్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్ధిదారులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక జరిపి ఇండ్లు కేటాయించలేకపోయారన్నారు. ప్రభుత్వం మారుతున్నా తమ బతుకులు మాత్రం మారడం లేదని, 25 సంవత్సరాలుగా గజ్వేల్ పట్టణంలో అద్దెకు ఉంటున్నామని ఆవేదన చెందారు. గత ప్రభుత్వంలో డ్రా పద్ధతిలో కేటాయించిన లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వకుండా మల్లన్న సాగర్ నిర్వాసితులకు అప్పగించారని అధికారులను నిలదీశారు. గతంలోనే అనేక సార్లు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు రేపు మాపు అంటూ ఏడాది కాలం గడుస్తున్నా ఇల్లు దక్కడం లేదన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితులు మాత్రం తమకు ప్యాకేజీ వచ్చేంతవరకు ఇండ్లను ఖాళీ చేసేది లేదన్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి లబ్ధిదారులతో చర్చించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆర్డీఓ చంద్రకళ మాట్లాడుతూ మల్లన్న సాగర్‌కు సంబంధించిన ప్యాకేజీ కొందరికే వచ్చినట్లు చెప్పుకొచ్చారు. ప్యాకేజీ వచ్చిన వారిని ఖాళీ చేయించి అందులో డ్రా పద్ధతిలో దక్కించుకున్న ఇంటి నెంబర్ గల వ్యక్తులకు వాటిని అప్పగిస్తామన్నారు. దీంతో లబ్ధిదారులు ధర్నాను విరమించారు.

వీరభద్ర ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ-రాయికోడ్

మండల కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం జరిగిన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్య క్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన ఆలయ కమిటీ చైర్మెన్‌గా కులకర్ణి ప్రభాకర్, వైస్ చైర్మెన్‌గా గోవ్వ భీమన్న, సభ్యులుగా, పి.బసవంతరావు, ఉప్పరి విటల్ బేకర్ కృష్ణవేణి బి.నర్సయ్య జొన్నాడ దత్తారెడ్డిలు మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రైతు భరోసా కింద ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు ఈనెల 26 నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వడంతో పాటు ఉపాధి హామీ కూలీలకు ఇంది రమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామన్నారు. ఇల్లు లేని నిరుపే దలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయను న్నట్టు చెప్పారు. రాయికోడ్ ఆలయ అభివృద్ధి కోసం గతంలో విశేష కృషి చేశా మన్నారు. ఆలయ అభివృద్ధి కోసం పాలకవర్గంతో కలిసి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. రాయికోడు, కప్పాడ్ చౌరస్తా రోడ్డు 20 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. రాయికోడ్‌లో ప్రభుత్వ ఐటిఐ ఏర్పాటుకు కృషి చేయనున్నట్టు మంత్రి తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంజయ్య, మండల ప్రత్యేక అధికారి జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివ రుద్రయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ వినయ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని ఎన్నికల హామీలు.. నిరాశలో స్కీం వర్కర్లు.. అసంఘటిత కార్మికులు







- కనీస వేతనం, ఉద్యోగ భద్రత కరువు
- చేసినంత కాలం జీతంలేదు...రిటైర్మెంట్స్ బెనిఫిట్స్ రావు
- పోరు బాటలో ఆశాలు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు
- భవన నిర్మాణ, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల పరిస్థితి అదే
- హామీల అమలు కోసం ఎర్రజెండా పోరాటాలు:జి.సాయిలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కరోనా లాంటి కష్టకాలంలో గ్లోబల్ లీడర్స్‌గా కీర్తించబడిన ఆశాలు, అంగన్వాడీలు, పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఇప్పటికీ వెల కట్టలేనివే. పనికి గ్యారంటీ... నిఖరమైన జీతముండదు. చాలీ చాలని వేతనాలతో సర్దుకుపోతూ ప్రజా సేవలో ఉన్న స్కీం వర్కర్లతో పాటు రెక్కలు ముక్కలు చేసుకుని కాయకష్టం చేసే అసంఘటి రంగంలోని భవన నిర్మాణ, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికుల పరిస్థితి అధ్వాన్యంగా ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దాటవేత ధోరణి ప్రదర్శిస్తుంది. స్కీం వర్కర్లు, కార్మికుల పక్షాన ఎర్రజెండా నిఖరంగా పోరాటాలు చేసిన ఫలితంగా కొన్ని సమస్యలు పరిష్కరించబడ్డాయి. కనీస వేతనాల పెంపు, పర్మినెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆరోగ్య బీమా వంటి మౌళిక మైన సదుపాయాల కల్పనలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి.

అంగన్వాడీ, ఆశాల పోరాటాలు

రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఐసీడీఎస్, జాతీయ ఆరోగ్య మిషన్ పథకాల్లో కీలకంగా పనిచేస్తూ సేవలందిస్తున్న ఆశా, అంగన్వాడీ వర్కర్ల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. రాష్ట్రంలో 35700 అంగన్వాడీలున్నాయి. వీటిల్లో పనిచేస్తున్న టీచర్స్, హెల్పర్స్ 50 వేలకుపైనే ఉన్నారు. రూ.7500 పాత వేతనాన్ని పెంచి రూ.13650 చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం అమలు చేయట్లేదు. 4 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసిన సర్కార్ వాటిల్లో హెల్పర్లను నియమించలేదు. పెంచుతామన్న వేతనాలు ఇవ్వట్లేదు. రాష్ట్రంలో 11 వేలకు పైగా అంగన్వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐసీడీఎస్‌కు నిధులు పెంచుతామని చెప్పిన ప్రభుత్వాలు పైసా అదనంగా కేటాయింపులు చేయట్లేదు. లక్షలాది మంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం, వైద్య సేవల్ని అందిస్తున్న అంగన్వాడీలను నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి ఉంది. రూ.18 వేల వేతనం, రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందని ద్రాక్ష అయ్యాయి. ఇక ఆశాల చేత వెట్టి చేయిస్తున్నారు. చేసిన పనిని బట్టి పారితోషికం ఇస్తున్నారు. రూ.18 వేల జీతం, రూ.50 లక్షల బీమా సదుపాయం, పారితోషికంలో సగం ఫించన్, పెండింగ్ పీఆర్సీ ఏరియల్స్, లెప్రసీ పెండింగ్ బిల్లులు, ప్రసూతి సెలవుల వంటి డిమాండ్స్‌లో వేటినీ సర్కార్ పరిష్కరించట్లేదు. రాష్ట్రంలో 30 వేల మంది ఆశాలు ఇచ్చిన హామీల్ని అమలు చేయాలని రోడ్లెక్కి కొట్లాడుతున్నారు. రాత పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఐకేపీ వీఓఏలు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై కూడా అనేక పోరాటాలు నడిపారు.

అసంఘటిత కార్మికుల పరిస్థితి అధ్వాన్నం

రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఏలాంటి సదుపాయాల్లేవు. భవన నిర్మాణ రంగంలో కోటి మందికిపైగా ఉన్నారు. వీరి కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు నిధుల్ని దారి మళ్లించిన ప్రభుత్వాలు అవినీతికి ఆజ్యం పోశాయి. ప్రయివేట్ బీమా సంస్థలకు అప్పజెప్పి కార్మికులకు అందుతున్న బెనిఫిట్స్ లేకుండా చేసేందుకు కేంద్రం ప్రయత్నించింది. సీపీఐ(ఎం) పెద్ద ఎత్తున పోరాడింది. హమాలీ రంగంలోని లక్షలాది మంది ఉన్నారు. రైస్ మిల్లులు, సిమెంట్ కంపెనీలు, ఇతర పరిశ్రమలతో పాటు ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో లక్షలాది మంది హమాలీలు పనిచేస్తున్నారు. వెల్ఫేర్ బోర్డు కోసం ఎర్రజెండా కొట్లాడింది. ప్రమాదాలు జరిగి మరణించినా గాయాలైనా కనీస పరిహారం ఇవ్వట్లేదు. వలస కార్మికులు పెరగడంతో కూలి రేట్లు కూడా గిట్టుబాటు కావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ రంగంలోనూ కార్మికులు పెరుగుతున్నారు. కేంద్రం తెచ్చిన కొత్త రవాణా చట్టంలో నిర్లక్ష డ్రైవింగ్‌పేర విధించే శిక్షలు కఠినంగా ఉన్నాయి. రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు పట్టని పాలకులు పన్నుల భారాలు మోపాయి.

జీతాల్లేని మున్సిపల్, జీపీ, మధ్యాహ్న భోజన కార్మికులు

స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీసం నెల వారిగా జీతాలివ్వట్లేదు. ఏడాదిగా పంచాయతీల్లో పాలక వర్గాల్లేక కేంద్ర నిధులాగిపోయాయి. ఆ పేరుతో కష్టం చేస్తున్న కార్మికులకు జీతాలివ్వట్లేదు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని పోరాడారు. కనీస వేతనాలివ్వాలని, యూనిఫామ్స్, బీమా సదుపాయం ఇతర సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్న కార్మికుల్ని సంఘటితం చేసిన సీపీఐ(ఎం) అనేక ఉద్యమాలు నడిపింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 పంచాయతీల్లో 10 వేల మంది పనిచేస్తున్నారు. 17 మున్సిపాలిటీల్లో వెయ్యి మంది వరకు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరి అర్హతల్ని బట్టి పర్మినెంట్ చేస్తామని, కనీస వేతనం ఫిక్స్ చేస్తామన్న హామీలు పట్టల్లేదు. మధ్యాహ్న భోజన పథకంలోనూ మహిళలు గౌరవ వేతనంతోనే పనిచేస్తున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్స్, ప్రమాద బీమా, పదవి విరమణ బెనిఫిట్స్ ఇస్తామని విస్మరించారు. అక్షయ పాత్ర లాంటి ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున పోరాడింది.

కార్మికులు, స్కీం వర్కర్ల పక్షాన సమరశీల పోరాటాలు



:జి.సాయిలు

అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులు, స్కీం వర్కర్ల సమస్య పరిష్కారం కోసం సీపీఐ(ఎం) అనేక సమరశీల పోరాటాలు నడిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు అందజేస్తూ సేవలందిస్తున్న ఆశాలు, అంగన్వాడీలకు కనీస వేతనాలివ్వట్లేదు. పర్మినెంట్ చేయాలని పోరాడుతున్నాం. ఇతర సదుపాయాలేవీ అందట్లేదు. ఎర్రజెండా పోరాడడం వల్ల కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. హమాలీ, భవన నిర్మాణ, ట్రాన్స్‌పోర్ట్ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, జీపుజాతలు, కలెక్టరేట్ల ముట్టడి వంటి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాల్ని సీపీఐ(ఎం) నడిపింది. సంగారెడ్డిలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించి పోరాట కర్తవ్యాల్ని రూపొందిస్తాం.

కష్టజీవుల పక్షపాతి ఎర్రజెండా

- ఉద్యోగులు, కార్మికులను విస్మరించిన ప్రభుత్వం
- కార్మిక, కర్షక భవన్ ప్రారంభ సభలో...
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

కష్టజీవుల పక్షపాతిగా ఎర్రజెండా పోరాడుతుందని, కార్మికులు, ఉద్యోగులు, పేదలు, రైతులు, మహిళల సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వాలు అశ్రద్ధ చూపుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. కార్మిక, కర్షక భవన్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట గడ్డపై కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, రైతులు, పేదల సమస్యల్ని పట్టించుకుని పరిష్కారమయ్యే వరకు పోరాడుతున్నది మాత్రమేనన్నారు. శ్రామిక ప్రజల పోరాటాల వేదికగా కార్మిక, కర్షక భవన్ పని చేస్తుందన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. శ్రమకు తగిన ఫలితం అందాలన్నారు. ఎన్నికల్లో కార్మిక హక్కుల్ని పునరుద్ధరిస్తామని చెప్పిన పాలకులు అధికారంలోకి వచ్చాక వాటి గురించే పట్టించుకోవడంలేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఎన్నికలు నిర్వహించి వేతనాలు, ఇతర సదుపాయాల్ని మెరుగపల్చాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ సేవలందిస్తున్న ఆశాలు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, వివోఎలకు కనీస వేతనాలు, పర్మినెంట్ వంట హామీల్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాస్తూ కార్పొరేట్ లాభాల కోసం లేబర్ కోడ్‌ను అమలు చేయాలని చూస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహించామన్నారు. రాబోయే కాలంలో మరింత సమరశీలంగా ఉద్యమించాల్సి ఉందన్నారు. దినసరి వేతనాలపై పని చేస్తున్న కార్మికులతో ప్రభుత్వం దోబూచులాడుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి అనేక సభల్లో మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పాడని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మాత్రం ఆ ఊసే ఎత్తట్లేదన్నారు. హమాలీ, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. గ్రామీణ పేదలకు కొద్దిపాటి పని దినాలు కల్పించే ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులు కోత పెట్టడం వల్ల పని గ్యారంటీ లేకుండా పోతుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన మోడీ మాట గాల్లోకి వదిలేసి ఉన్న ఉద్యోగాల్ని కోల్పోయేలా ప్రయివేటీకరణ చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా సమరశీలంగా ఉద్యమిస్తున్నారన్నారు. ఇతర శ్రామిక ప్రజలు సైతం పోరాటాల్లోకి రావాలని కోరారు.

కార్మిక, కర్షకులకు అండగా:

ఆముదాల మల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

కార్మికులు, కర్షకులకు అండగా భవన్ ఉంటుందని, వారి సమస్యల పరిష్కరం కోసం నిరంతరంగా పోరాడుతామని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆముదాల మల్లారెడ్డి అన్నారు. పేదలు, శ్రామికులు, కార్మికులు, కర్షకుల పక్షాన పోరాడుతున్న ఏకైన జెండా ఎర్రజెండా మాత్రమేనన్నారు. రైతులు, కూలీలు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు, మైనార్టీల కోసం పని చేస్తున్న ప్రజా సంఘాలకు ఈ భవనం కేంద్రంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మల్లేశం, జనగాం జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సిద్దిపేట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శశిధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, జిల్లా కోశాధికారి బాస్కర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, ప్రజా సంఘాల జిల్లా నాయకులు చొప్పరి రవి, ఆలిటి యాదగిరి, వెంకట్ మావో, దాసరి ప్రశాంత్, సింగిరెడ్డి నవీన, శిరీష, తాడూరి రవిందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, శ్రీనివాస్, అమ్ముల బాలనర్సయ్య సీనియర్ నాయకులు నక్కల యాదవరెడ్డి పాల్గొన్నారు.

జోగిపేటకు చేరుకున్న సీపీఐ(ఎం) ప్రచార జాత

నవతెలంగాణ-జోగిపేట, నారాయణఖేడ్‌రూరల్



ఈనెల 25వ తేదీ నుంచి సంగారెడ్డిలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా చేపట్టిన ప్రచార జీపు జాత సోమవారం రాత్రి జోగిపేట పట్టణానికి చేరుకుంది. ఆదివారం సిద్దిపేటలో ప్రారంభమై.. మెదక్‌లో తిరుగుతూ నారాయణఖేడ్‌కు.. అక్కడి నుంచి వట్‌పల్లి మీదుగా సోమ వారం రాత్రి చివరగా జోగిపేటకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు మాట్లాడుతూ.. ప్రజలకు కూలి పెంచాలని.. భూమి పంచాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీలో రెండువందల రోజుల పని దినాలు పొడిగించాలని.. కూలి రూ.600 కల్పించాలని ఇలా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) పోరాటాలు చేస్తున్నదన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో అనేకమంది చదువుకున్న వారు ఉన్న ప్పటికీ పరిశ్రమలు తీసుకురాకపోవడం దురదృష్టక రమన్నారు. ఇలాంటి ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) పోరాడుతున్నదన్నారు. ఇలాంటి అనేక అంశాలపై ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలలో చర్చించి ఉద్యమాల భవిష్యత్ కార్యక్రమం రూపొందిస్తారన్నారు.కాబట్టి ఈ ప్రాంత యువకులు, కార్మికులుభారీ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జోగిపేటలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు డి. విద్యాసాగర్, నాయకులు శేఖర్, నాగ భూషణం, రాములు, శివ, పెంటయ్య, నారాయణఖేడ్‌లో ఏరియా కమిటీ కార్యదర్శి రమేష్, బృంద సభ్యులు సతీష్ అర్జున్ శివరాజ్ అనిల్ ప్రవీణ్ అరుణ్ సంతోష్ రాజు శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలి

సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్

క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన వారికి బహుమతులు అందజేత

నవతెలంగాణ-సదాశివపేట



యువత బాగా చదువుకొని దేశ అభివృద్ధిలో భాగ స్వాములు కావాలని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్య దర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు.సమాజ అవసరాల కోసం కూడా యువత ఆలోచించాలని, డ్రగ్స్ ఇతర చెడు అలవా ట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పార్టీ మహాసభల నేపథ్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు నిర్మాణంలో.. దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలన్నారు. చదు వుల్లో రాణిస్తూ మంచి స్థాయికి ఎదగాలన్నారు. శారీరకంగా మానసికంగా ఉల్లాసంగా ఉండడం కోసం క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చెడు అలవాట్లకు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని.. మంచి ఆలోచనలు సమాజం కోసం ఉపయోగపడే పనులు చేయాలన్నారు. దేశంలో రాజకీయాలు భ్రష్టు పడుతున్న కాలంలో మంచి రాజకీయాల కోసం యువత ముందుకు రావాలన్నారు. సీపీఐ(ఎం) నాయకత్వం నీతిగా నిజాయితీగా దేశ అభివృద్ధి, సమాజ అభివృద్ధి కోసం పని చేస్తున్నదన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకపోవడంలో సీపీఐ(ఎం) ఎల్లవేళలా కృషి చేస్తున్నదన్నారు. సమ సమాజ స్థాపన కోసం జరిగే పోరాట కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.అనిల్, మల్లేశం, ప్రవీణ్, రమేష్ గౌడ్, శ్రీశైలం, ఏసోబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల

పార్టీ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ- వెల్దుర్తి



సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ, మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గౌరీ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో హమాలి కార్మికులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర 4 వ మహాసభల సభ పోస్టులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ హమాలి కార్మికుల ఉద్దేశించి మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణంలో నాలుగు రోజులపాటు జరుగుతునాయన్నారు. గత మూడు సంవత్సరాలుగా చేసిన కార్మిక ప్రజా పోరాటాలు ఉద్యమాలను సంక్షించే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి మహాసభలో చర్చిస్తాయన్నారు. జనవరి 25వ తేదీన భారీ బహిరంగ సభ సంగారెడ్డి ఐబి నుంచి పీఎస్ఆర్ గార్డెన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభకు ఆలిండియా నాయకులు పాల్గొంటారన్నారు. 25వ తేదీన జరిగే బహిరంగ సభకు ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి నుంచి కార్మిక రంగం రైతులు వ్యవసాయ కూలీలు పార్టీ శ్రేయోభిలాషులు తరలిరావాలన్నారు. ప్రజలు అందరూ బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

10వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-నిజాంపేట



నస్కల్‌కు రోడ్డు వేయాలని 10 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం బాధాకరమని నస్కల్ గ్రామస్తులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించని ఎడల ధర్నాలు రాస్తారోకోలు, వంటావార్పు, తెలంగాణ కోసం ఏ విధంగా కొట్లాడినామో ఆ విధంగానే కొట్లాడడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంకా వినూత్న రీతిలో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టు రాజు, దొంతరమైన దుర్గయ్య మెట్టు లింగం, కుమ్మరి నరేష్, ఆకుల రమేష్ గౌడ్, ఎండి రహీం, దొంతరమైన శ్రీకాంత్, పోలు శ్రీనివాస్ చిన్న పాల్గొన్నారు.

గోడలు.. మహాసభలకు పిలుపులు



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

- కలెక్టర్ క్రాంతి వల్లూరు
- ప్రజావాణికి 56 దరఖాస్తులు

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 56 మంది తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజల ప్రధాన సమస్యలపై పూర్తి దృష్టి పెట్టి, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురితో కలిసి జిల్లాలోని ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచా యతీ ప్రత్యేక అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా



జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలపై ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యాని తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. గ్రామ సభలలో ఫ్లెక్సీలు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితాను ప్రచురించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై రిజిస్టర్ లను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని, గ్రామ సభలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, గ్రామ సభలను ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నిర్వహించాలని, గ్రామ సభలకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల్లో లబ్దిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా వివరించాలని, ఈ మొత్తం సంక్షేమ పథకాల రోజు వారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులందరికీ రేషన్‌కార్డు మంజూరు చేయాలి

నవతెలంగాణ-కొండాపూర్

అన్ని అర్హతలు కలిగివున్న కుటుంబాలకు రేషన్‌కార్డులు తప్పకుండా మంజూరు చేయాలని తహసీల్దార్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ మనోజ్‌కి సోమవారం హరిదాస్పూర్ గ్రామ యువత వినతి పత్రం అందజేశారు. అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి రేషన్ కార్డ్ మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతీ ఒక్క కుటుంబానికి రేషన్‌కార్డును ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి.. అర్హులందరినీ గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హరిదాస్పూర్ గ్రామ యువకులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు నమూనా నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలోని మండల కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందించే విధంగా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. మొదటగా స్థలం ఉన్న వారికి 5 లక్షలతో విడుతల వారీగా ఇండ్లను ఇవ్వడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ షేట్కర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ దారం శంకర్ సెట్, రాజేష్ చౌహాన్, రామకృష్ణ, మాజిద్, నర్సింలు, హనుమాండ్లు కౌన్సిలర్లు, తాహేర్ మండల అధ్యక్షులు, రమేష్ చౌహాన్,పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, సంగన్న న్యాయవాది,యాదవ రెడ్డి మాజీ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్ల కోసం నోటిఫికేషన్

నవతెలంగాణ-మునిపల్లి

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మునిపల్లిలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో 100 సీట్లు, ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డా.కె. మల్లిక తెలిపారు. జనవరి 6 వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసి విద్యార్థులకు రూ. 200 రుసుము, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్సీ, ఈడబ్ల్యూ ఎస్ విద్యార్థులకు రూ.125 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఏప్రిల్ 13వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్ష సమయం ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్హత పరీక్ష ఉంటుందని, ఏడో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు. http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేషనల్ హైవేలుగా ప్రతిపాదనలు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని రెండు రహదారులను నేషనల్ హైవేలుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్ల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఈ విషయమై పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ శేట్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, రాజేష్ చౌహాన్ రామకృష్ణ, హనుమాండ్లు, నర్సింలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు..



నూతన వస్త్రాధారణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని బీబీపేట్ గ్రామానికి చెందిన బండారి యేసయ్య కూతురి నూతన వస్త్రాలంకరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మారేపు సాయిలు,బాల్ రెడ్డి,నారాయణ రెడ్డి, లక్ష్మణ్, బాబు,అంజయ్య, దేవ రెడ్డి, వెంకట్ రెడ్డి,ఖాదర్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28 జరగాల్సిన సదరం శిబిరం వాయిదా

నవతెలంగాణ-సంగారెడ్డి

సదరం వెబ్‌సైట్‌లో సాంకేతిక మార్పులు జరుగుతున్న నేపథ్యం లో ఈనెల 28వ తేదీన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంగారెడ్డిలో నిర్వహించాల్సిన సదరం శిబిరం నిర్వహించడం లేదని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ గాయత్రి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదిని పత్రికా ప్రకటన ద్వారా మళ్ళీ తెలియజేస్తామన్నారు.



ఉజ్జీవ కూటముల జాతర ఏర్పాట్లపై సమావేశం

నవతెలంగాణ-న్యాల్‌కల్

హద్నూర్ గ్రామంలో మెథడిస్ట్ ఈస్టర్ గుట్ట జాతర డీఎస్ జిల్లా రేవరెండ్ సుకుమార్ సమక్షంలో ఉజ్జీవ కూటముల జాతర ఏర్పాట్లపై సోమవారం ముఖ్య నిర్వాహకులతో యూత్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఫిబ్రవరి 21, 22, 23 తేదీల్లో జరిగే జాతరకు మండలంలోని క్రైస్తవులు, యూత్ సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని డీఎస్ రేవరేండ్ సుకుమార్ హద్నూర్ పాస్టర్ రాజారావు పిలుపునిచ్చారు. జాతరకు ఇబ్బంది కలగకుండా ఈస్టర్ గుట్ట నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం డీఎస్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దేవదానం, స్వామి దాస్, సామెల్, నర్సింలు, దేవదర్శన్, లెమన్ నర్సింలు, దేవప్ప, యూత్ సభ్యులు ప్రణీత్, తదితరులున్నారు.



నేటి నుంచే గ్రామసభలు

నవతెలంగాణ-మనూర్, వట్‌పల్లి

ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామపంచాయతీ కార్యాల యాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మనూర్ ఎంపీడీఓ మహేష్‌రావు, వట్‌పల్లి ఎంపీడీవో శశి ప్రభ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డ్స్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతీ కుటుంబానికి అందించేందుకు ఈ గ్రామసభలు నిర్వహి స్తున్నట్టు చెప్పారు. ఈ సభల్లో వ్యవసాయ, రెవెన్యూ, గ్రామ ప్రత్యేక అధికారి, గ్రామ కార్యదర్శులతో పాటు గ్రామ ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. ప్రజలు సకాలంలో హాజరై గ్రామసభలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని బుదేరా వద్ద గల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులు అధ్యాపకులతో చర్చించి.. మౌలిక సదుపాయాలు, కళాశాల అభివృద్ధికి గాను గతంలో ఇచ్చిన హామీలు, అంతర్గత డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతి పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. వాటితోపాటు త్వరలో కళాశాలకు ప్రహరీ గోడతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేస్తావని హామీ ఇచ్చారు. అనంతరం తాటిపల్లి గ్రామంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులతో పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపా యాలను సీఎస్ఆర్ నిధులతో చేపడతామన్నారు. కస్తూర్బా పాఠశాలలో వంటగదిని పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు విశాలమైన డైనింగ్ హాల్ నిర్మాణం, డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు ఆర్వో ప్లాంట్ అదనపు తరగతి గదులు, అదనపు తరగతి గదుల నిర్మాణం పేరెంట్స్ వెయిటింగ్ హాల్ నిర్మాణం పనులు సీఎస్ఆర్ నిధులతో చేపడతామన్నారు. ఆయన వెంట ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ ఆశాజ్యోతి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌మాధవి, కస్తూరిబా ప్రిన్సిపల్ కవిత, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సతీష్, మాజీఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండు తదితరులు ఉన్నారు.

మెట్రోరైల్‌ను మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు విస్తరించాలి

- మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ
- మంత్రి దామోదరకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-పటాన్‌చెరు

మెట్రోరైల్‌ను మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు విస్తరించాలని మెట్రో రైల్ సాధన సమితి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కే.సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు ను విస్తరించాలని ప్రతిపాదించిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీ.వోలో పటాన్‌చెరు వరకు మాత్రమే ప్రతిపాదించిందని, సంగారెడ్డి జిల్లాకు లాభం జరగాలంటే పారిశ్రామిక వాడ ఇస్నాపూర్‌పూర్ వరకు మెట్రోను పొడగించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే విధంగా చొరవ తీసుకోవాలని జిల్లా మంత్రిని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెట్రోరైల్ సాధన సమితి సభ్యులు రుద్రారం శంకర్, అన్వర్ పటేల్, మెట్టు శ్రీధర్, చవ్వ రమేష్ పాల్గొన్నారు.



ప్రభుత్వమిచ్చిన హామీలు అమలు చేయాలి

- అక్రమ మద్యం బెల్టు షాపులను అరికట్టాలి
- జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆశన్న గౌడ్,రమేష్ గౌడ్
- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి

కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అక్రమ మద్యం బెల్టు షాపులను అరికట్టాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్. ఆశన్న గౌడ్, ఎస్. రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి కలెక్టర్ క్రాంతి వల్లూరుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా అధిక ధరకు విక్రయిస్తున్నా.. పోలీసు అధికారులు గానీ జిల్లా ఎక్సైజ్ అధికారులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. దాంతో గ్రామాల్లో కల్లు అమ్ముడు పోకపోవడంతో గౌడ సోదరులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంపిల్ల పేరుతో నిత్యం కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చేస్తున్న దాడులను వెంటనే ఆపాలన్నారు. అక్రమంగా గ్రామాలకు రాత్రి వేళల్లో ఆటోల్లో మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తిలో ప్రమాదాలను నివారించడానికి కాటమయ్య రక్షణ కవచం పేరుతో సేఫ్టీ కిట్లును ప్రభుత్వం ఇస్తుందని అందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కానీ ఇవి చాలా పరిమితంగా ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సభ్యత్వం కలిగిన వాళ్లరాష్ట్రంలో 2 లక్షల 50 వేల మంది ఉంటే కేవలం 10 వేల మందికి మాత్రమే పంపిణీ చేశారన్నారు. కొన్ని గ్రామాల వారికి ఇంకా రాలేదన్నారు. ఏడాది కాలంలో చనిపోయిన వారి కుటుంబాలకు, వికలాంగులైన వారికి



ప్రభుత్వం ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా రూ.7 కోట్ల 90 లక్షలు ఇప్పటివరకు బాధితులకు అందలేదన్నారు. ఎన్నికల ప్రణాళికలో నెలరోజుల లోపు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచుతామన్నారని... అన్నమాట ప్రకారం అమలు చేయాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనం లో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 8 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. బిల్డింగ్, మిషనరీ నిర్మాణం పూర్తయింది కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేడు పడావు పడి ఉందన్నారు. గీత కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న రెండు వేల పెన్షన్‌ను చేయూత పథకం ద్వారా నాలుగు వేల రూపాయలకు పెంచుతామని ఎన్నికల ప్రణాళికలో ప్రకటించారని.. ఇంకా ఇది ఆచరణ రూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలోజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామా గౌడ్, రవి గౌడ్ సంగారెడ్డి మండలాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు కృష్ణ గౌడ్, నాయకులు పవన్ గౌడ్ నారాయణ గౌడ్, మల్లేశం గౌడ్ లచ్చగౌడ్, సుదర్శన్ గౌడ్, శేఖర్ గౌడ్, ప్రభు గౌడ్ ,మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కోటి రూపాయలతో నిర్మించిన పంచతత్వ పార్కు ప్రారంభం
- బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు సాయి అంబికా కాలనీలో కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన పంచతత్వ పార్కును స్థానిక మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగంగారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం 16వ వార్డు పరిధిలోని నర్రెగూడెం ఇండస్ వ్యాలీ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ



సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామ న్నారు. అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మెన్ నందారం నరసింహాగౌడ్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, కమిషనర్ జ్యోతి రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర ఆదేశాల ప్రకారం సోమవారం బాలసదనం, సఖి కేంద్రం, శిశు గృహంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ మాట్లాడుతూ.. పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అదేవిధంగా వారి బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా



ఉంచాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని.. ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన





నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని ఉపాధ్యాయ సంఘాల పిలుపునిచ్చిన విషయం విధితమే. అందులో భాగంగా నారాయణఖేడ్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనల్లో పీఆర్టియూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హనుమయ్య, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞానమంజరి పాల్గొని మాట్లాడుతూ..తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాములుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలన్నారు. అదేవిధంగా పైడిపల్లి పాఠశాలలో జరిగిన నిరసనల్లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అశోక్, అనంతసాగర్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాశీనాథ్ పాల్గొన్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులు ఏసుదాసు శ్రీరాంనాయక్.. హనుమంతరావుపేట్, సంజీవరావుపేట్, పైడిపల్లి, పిప్రీ, తుర్కపల్లి, అనంతసాగర్, నారాయణఖేడ్ టౌన్ వివిధ పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ నిరసనల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.యాదవరెడ్డి, అలివేలు, శశికళ, అనురాధ, భాగ్యమ్మ ,పాషా మియా, కవిత, నిర్మల, సౌమ్య, మన్నన్, అనిత, నారాయణ, రాజప్ప, శ్రీలత, గౌరమ్మ, సంకి భాయ్ ,పెంటమ్మ, పుత్లబాయి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ఎం. సుచరిత, మండల ఉపాధ్యక్షులు వీణాధరిలు మాట్లాడుతూ..



మూకదాడికి పాల్పడ్డ వ్యక్తులను నెలరోజులు గడుస్తున్నా అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. పాఠశాలల్లో పని ప్రదేశాల్లో ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవా లన్నారు. ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జెడ్పీహెచ్ఎస్ ఇస్మాయిల్‌ఖాన్‌పేట్‌లో టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వై. సైమన్, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు శ్రీనివాసచారి పాల్గొన్నారు. జెడ్పీహెచ్ఎస్ పసల్వాది పాఠశాలలో సంగారెడ్డి మండల అధ్యక్షులు కే.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జహీరాబాద్ : వివిధ ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు జహీరాబాద్ పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపుతూ విధులు నిర్వహించారు. ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దుండగులు దాడులు చేయడం.. నానారకాలుగా ఇబ్బందుల గురి చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. దుండగులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-రాయికోడ్



మండల పరిధిలోని సంగాపూర్ ఎంపీటీసీ భర్త, మండల నాయకులు సుభాష్‌రెడ్డి కుటుంబాన్ని, ఉపసర్పంచ్ నాగేష్ కుటుంబాలను అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సోమవారం పరా మర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా తాను అండగా ఉంటానన్నారు. పార్టీ కార్యకర్తలు ఎప్పుడు అధైర్య పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు చేవెళ్ల విట్టల్, బీఆంఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరు శంకర్, వరం వైస్ చైర్మన్ తుకారం, మాజీఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పటేల్, పీఏసీఎస్ చైర్మెన్ హనుమంతు, నాయకులు బసవరాజ్ ,మల్లు పాటిల్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రూ.53,000 వేల నగదు పట్టివేత.. ఆరుగురిపై కేసు నమోదు

నవతెలంగాణ-మనూర్

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి.. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మనూర్ ఎస్ఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మనూరు మండలం రానాపూర్ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు దాడులు జరిపారు. పేకాట ఆడుతున్న సమయంలో ఎనిమిది మంది ఉండగా.. ఇద్దరు పరారయ్యారు. ఆరుగురిని పట్టుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.53వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలి



నవతెలంగాణ-జోగిపేట

విద్యార్థులు రాబోవు పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ సభ్యులు పల్లవి, భాగ్య, హేమలు సూచనలు చేశారు. జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఆదేశానుసారం హార్ట్‌ఫుల్ నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు పరీక్షల్లో ఒత్తిడికి లోను కాకుండా ఉండడం గురించి పలు సూచనలు తెలిపారు. విద్యార్థులతో మెడిటేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రజిత, అధ్యాపకులు విట్టల్, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, జీల మల్లేశం, రాజ్ కుమార్, జక్కుల మల్లేశం, అనిత, శశికళ, ప్రసన్న, బాలరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రామ సభల నిర్వహణ



నవతెలంగాణ-శివ్వంపేట

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 4 పథకాలను అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్న క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసభల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మంగళవారం రూప్లతండా, గూడూరు, భోజ్యతండా, మగ్దుంపూర్, మల్లుపల్లితండా, భీమ్లాతండా, లింగోజీగూడ, చెన్నాపూర్, పిల్లుట్ల, రెడ్యాతండా, గంగాయిపల్లి, 22న గుండ్లపల్లి, కొత్తపేట, తిమ్మాపూర్, లచ్చిరెడ్డిగూడెం, బిక్యతండా, బిజిలిపూర్, శబాష్ పల్లి, సికింద్లాపూర్, కొంతాన్ పల్లి, పెద్దగొట్టిముక్కుల, పాంబండ, టిక్యాదేవమ్మ గూడెం, ఉసిరికపల్లి, సీతారాంతండా, 23న దొంతి, రత్నాపూర్, గోమారం, చండి, చిన్నగొట్టిముక్కుల, ఎదుల్లాపూర్, దంతాన్ పల్లి, శివ్వంపేట, అల్లీపూర్, నవాబ్ పేట, పోతులబోగూడ గ్రామాలలో గ్రామసభలను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- ఆర్డీఓ రమాదేవి

నవతెలంగాణ- నిజాంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నాలుగు పథకాలను అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. ఆమె సోమవారం నిజాంపేట రైతు వేదికలో రెవెన్యూ సిబ్బంది వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులకు చేకూర్చే విధంగా ఎంపిక చేయాలన్నారు. గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడానికి గ్రామపంచాయతీ అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. 21 తేదీన బచ్చు రాజు పల్లి, జెడ్ చెరువు తాండ, నంద గోకుల్, రాంపూర్, రజాక్ పల్లి, 22 తేదీన నగరం, నార్లాపూర్, నస్కల్, తిప్పనగుల్ల, కే వెంకటాపూర్, 23 తేదీన చల్మెడ, కల్వకుంట, నందిగామ, నిజాంపేట, ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఆర్ ఐ ప్రీతి, ఆర్ ఐ ఇమాద్ , సీనియర్ అసిస్టెంట్ రమేష్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు, ఒకరు మృతి

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన చిమ్మనమైన సురేష్ (27) ఆదివారం బైకుపై వెళ్తుండగా వెనుక నుండి కారు అతివేగంగా వచ్చి ఢీకొని మృతి చెందారు. మృతుడు సురేష్‌కు భార్య జయ, ఒక సంవత్సరం కొడుకు ఉన్నారు. చిమ్మనమైన సురేష్ సొంత పనిపై హైదరాబాద్ వెళుతుండగా నార్సింగి గ్రామ వడ్డెర ఇండ్ల వద్ద ఎర్టిగా కారు టీ ఎస్ 02ఎఫ్ ఎచ్ 2698 ఢీకొట్టడంతో సురేష్‌కు కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

టీచర్లపై అరాచక శక్తుల దాడులు అరికట్టాలి

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



నవతెలంగాణ -పాపన్నపేట

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులను అరికట్టాలని ఉపాధ్యాయ సంఘాల పిలుపుమేరకు పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం తుక్కుగూడజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని, బాధ్యులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, పిఆర్టి నాయకులు ప్రవీణ్, నింగప్పతో పాటు ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, రియాజ్, మంగ నర్సింలు, మోహన్ రావు, చంద్రమోహన్, రమేష్ , రవికాంత్ ,శ్రీహరి, శ్రవణ్ కుమార్, విశ్వనాథ్, పద్మ, మునావత్ రజిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

ముగిసిన సంక్షేమ పథకాల సర్వే



నవతెలంగాణ-సంగునూరు

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల సర్వే సోమవారం ముగిసిందని ఎంపీడీఓ బి. లక్ష్మప్ప తెలియజేశారు. మండలంలోని అప్పలాయ చెరువు, మైనంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. నేటి నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. టీంల వారీగా అధికారులు హాజరవుతారని చెప్పారు.

మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



నవతెలంగాణ-సంగునూరు :ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, నంగునూరు మండలం ఇన్చార్జి ఆరెపల్లి కనకయ్య మాదిగ, జిల్లా సంయుక్త కార్యదర్శి కందికట్ల రాజు మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షులు దేవులపల్లి బాలరాజు మాదిగ హెచ్చరించారు.సోమవారం మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి పై చట్టరీత్యా చర్య తీసుకోవాలని రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్టి చంపుతానని బెదిరింపులకు పాల్పడుతూ ప్రకటనలు చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు.

- డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్

నవతెలంగాణ-కొండపాక

75 ఏళ్ల భారత రాజ్యాంగ ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం నాడు సిద్దిపేటలో భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ తెలిపారు. డిబిఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవం నుంచి భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు జనవరి 26 గణతంత్ర దినోత్సవం వరకు భారత రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రచార ఉద్యమం చేపట్టినట్లు భీమ్ శేఖర్ తెలిపారు. ఈ ప్రచార ఉద్యమంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని టి.పి.టి.ఎఫ్ ఉపాధ్యాయ భవన్‌లో జిల్లాస్థాయి భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సదస్సును విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

విద్యుత్ ఉద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్

- జేఏసీ చైర్మన్ స్వామి

నవతెలంగాణ-మెదక్

ట్రాన్స్కో, జెన్కోలో ఉన్న 20,000 మంది ఉద్యోగులను వెంటనే కన్వెన్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మీద పట్నంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ముందు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ట్రాన్స్కో, జెన్కోలో ఉన్న ఉద్యోగులను విద్యార్హతను బట్టి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను ఎంత మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని సవరించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మహేందర్ రెడ్డి బన్నప్ప సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులు ఎలాంటి పోరాటాల పోరాటాలకైన సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.



రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ
- గ్రామ/వార్డు సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, పౌరసరఫరాల అధికారి సురేష్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆర్డీవోలు, జిల్లా, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్‌లతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే పరిశీలన ప్రక్రియ, గ్రామవార్డు సభల నిర్వహణపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సంబంధిత అధికారులకు సూచనలు చేసి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయడం కోసం నిర్వహిస్తోన్న క్షేత్రస్థాయి సర్వే పరిశీలనలో అలసత్వం వహించకుండా వేగవంతం చేసి, ఎట్టి పరిస్థితుల్లోనూ రేపటిలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ టెలికా న్ఫరెన్స్లో అన్ని తహసీల్దార్లు, కమిషనర్లు, ఎంపిడిఓలు, పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- 102. దరఖాస్తులు స్వీకరణ
- 6జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

నవతెలంగాణ-మెదక్



ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 102 దరఖాస్తులు రాగా వాటిలో ధరణి-38 , ఇందిరమ్మ ఇండ్లు-11, రుణమాఫీ-03 రేషన్ కార్డుల కొరకు-10, ఇతర సమస్యలు -40 సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ భుజంగరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓపీడీ శ్రీనివాసరావు సంబంధిత ఇతర శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ స్వీకరించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-శివ్వంపేట



గ్రామాలలో పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ మన్నెగల్ల సత్యనారాయణతో కలిసి పశువులకు ఉచితంగా నట్టల మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ గోపాలమిత్ర ద్వారా గ్రామంలోని గర్భాధారణ పొందిన 65 గేదెలకు, 10 ఆవులకు చూడీ పరీక్షలు, 10 గేదెలలో ఉచిత కృత్రిమ గర్భధారణలు, 33 దూడలకు సంబంధించి నట్టల నివారణ మందులను పంపిణీ చేశామని తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామలలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. గ్రామంలో అధిక పాల ఉత్పత్తిని సాధిస్తున్న ముగ్గురు పాడి రైతులను ఎంపిక చేసి ప్రోత్సాహకాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవిఓ పవన్ కుమార్, ఓఎస్ లక్ష్మణ్, గోపాలమిత్ర ప్రకాష్,గ్రామ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-శివ్వంపేట



మండలంలోని సీతారాంతండా గ్రామపంచాయతీ పరిధిలో అనారోగ్యంతో ఇటీవలే బానోత్ లక్ష్మణ్ మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఆర్థిక, ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షులు రాజేందర్ నాయక్, రమవత్ లక్ష్మణ్, మహేందర్ మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ ప్రతి గ్రామంలో, గిరిజన తండాలలో కూడ ఆపదలో ఉన్న ప్రతి బాధిత కుటుంబానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తూ, సీతారాంతండా గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన తండాలలో బాధితులను ఆదుకుంటున్న మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్తకు రాజేందర్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు చందర్, నగేష్, అశోక్, సురేష్, కబీర్ దాస్, శ్రీనివాస్, విజయ్, బాబా, అల్లం శివ్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

దంతాన్ పల్లిలో పీఏసీఎస్ చైర్మన్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-శివ్వంపేట



బాధిత కుటుంబాలకు తనవంతు సహకారం తప్పకుండ అందిస్తానని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం దంతాన్ పల్లిలో మృతి చెందిన పెద్దబోయిన చిన్న బాలయ్య కుటుంబాన్ని చైర్మన్ వెంకట్రాంరెడ్డి పరామర్శించి, ఓదార్చారు. బాధిత కుటుంబానికి తనవంతు తన స్వంతంగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ బాధితులకు తనవంతుగా అన్నివిధాలా ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో గొల్ల మధు, గజేంద్రుల నర్సిములు, గొల్ల నాగేందర్, గడ్డం నరేష్, గొల్ల యాదగిరి, గొల్ల రాములు, గొల్ల దుర్గయ్య, బాగులు, పాల్గొన్నారు.

కోతుల విధ్వంసంతో కూలిన ఇంటి రేకులు

నవతెలంగాణ-శివ్వంపేట



అడవిలో నుంచి వచ్చిన కోతుల మంద ఒక్కసారిగా ఇండ్లపైన దాడి చేసి సృష్టించిన విధ్వంసంలో ఇంటి రేకులు పూర్తిగా ధ్వంసమైన ఘటన మండలంలోని పిల్లుట్ల గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాసరి పోచయ్య, చంద్రమ్మ దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ తన ఇద్దరి పిల్లలు దాసరి లింగం, రిక్తేశ్వర్‌లను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిస్తూ ఉన్న చిన్నపాటి రేకులో ఇంటిలో నివాసముంటున్నారు. రోజుమాదిరిగానే పోచయ్య దంపతులు వ్యవసాయ పనులకు వెళ్లగా, పిల్లలిద్దరు పాఠశాలకు వెళ్లగానే కోతుల గుంపులు రేకుల ఇంటిపైకెక్కి ఎగురుడు, దుంకుడు చేయడంతో ఇంటి రేకులన్నీ కూలిపోయాయని బాధితులు విలపిస్తూ తెలిపారు. ఉన్న ఇల్లు కాస్తా కూలిపోవడంతో బాధిత కుటుంబసభ్యులు రోడ్డున పడ్డారని పలువురు విచారం వ్యక్తం చేశారు. కోతుల దాడిలో ఇంటి రేకులు ధ్వంసమైన పోచయ్య కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

గ్రామ సభల నిర్వహణ షెడ్యూల్ ప్రకటించిన ఎంపిడిఓ

నవతెలంగాణ-నార్సింగి



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్న నాలుగు నూతన పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే పూర్తయ్యిందని ఎంపిడిఓ ఆనంద్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కొరకు 4311 దరఖాస్తులు రాగా వంద శాతం సర్వే పూర్తి చేశామని, రేషన్ కార్డుల కోసం మొత్తం 1190 దరఖాస్తులలో 876 మార్పులు, కూర్పుల కోసం, నూతన కార్డుల కోసం 317 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రైతు భరోసా కోసం 756 అర్హులను తేల్చామని తెలిపారు. ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో మండల వ్యాప్తంగా నిర్వహించబోయే గ్రామ సభల షెడ్యూల్ ను విడుదల చేసారు. 21న పెద్ద తాండా, సంఖాపూర్ తాండా, భీం రావు పల్లి లో, 22 న వల్లూరు, నర్సంపల్లి, శేరిపల్లి లో, నార్సింగి, శంఖాపూర్, జప్తి శివునూరులలో 23న గ్రామ సభలకు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని గ్రామాల లో తెలిపిన తేదీల ప్రకారం ప్రత్యేక ఆఫీసర్ల ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి, రైతులు, ప్రజల చేత ఆమోదించబడిన వారిని పథకాలకు అర్హులుగా ఎన్నుకుంటామన్నారు. అలా ప్రజల సమక్షంలో పారదర్శకంగా ఎన్నుకున్న లబ్ధిదారుల జాబితాను ఆన్లైన్‌లో పొందుపరిచి, పై అధికారులకు అందజేస్తామని వివరించారు.

ఫీల్డ్ వెరిఫికేషన్ రికార్డులు తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, రూపొందించిన వివరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వ్యవసాయ యోగ్యం గాని భూములను సందర్శించిన కలెక్టర్, ఆహార భద్రత (రేషన్) కార్డులు, రైతు భరోసా పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సంబంధిత వివరాలతో కూడిన రిజిస్టర్లను తనిఖీ చేసి, గ్రామ సభల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహణ సమాచారం ప్రజలకు తెలిసేలా టామ్ టామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.16వ తేదీ నుండి 20 వ తేదీ వరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ యోగ్యమైన, వ్యవసాయం చేయని భూముల సమగ్ర సమాచారం సేకరణ చేసారని తెలిపారు. అట్టి జాబితాను గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా చదివి వినిపించి తుది జాబితా తయారు చేయనున్నట్లు తెలిపారు. నూతన రేషన్ కార్డులకు గ్రామ సభలలో దరఖాస్తుల స్వీకరించాలని తెలిపారు. రేషన్ కార్డులు జారీ అనేది నిరంతర ప్రక్రియని ఆయన పేర్కొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో గుణాత్మకమైన విద్యను పెంపొందించాలి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుణాత్మకమైన విద్యను పెంపొందించాలని మండల ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మండల విద్యాధికారి మధుమోహన్‌తో భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కరుణాకర్ ,నాగులు మీరా సమక్షంలో అన్ని యూనియన్ల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో గుణాత్మక విద్యను పెంపొందించడానికి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రేరణ కలిగించడానికి మండల స్థాయిలో విషయాల వారిగా పోటీ కార్యక్రమాలను ఫిబ్రవరి 14 నిర్వహించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో తెలుగులో చదవడం, రాయడం, ఇంగ్లీషులో చదవడం, రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలపై ఒలంపియాడ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించడం, ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా నిర్వహించాలని తీర్మానించారు.

చిన్న విషయాలకే జీవితాలను నాశనం చేసుకోద్దు

- జిల్లా ఉపాధ్యక్షులు బబ్బురి వెంకటేష్ యాదవ్

నవతెలంగాణ-శివ్వంపేట



ఆర్థికపరమైన లావాదేవీలు, కుటుంబ విషయాలలో చిన్న చిన్న గొడవలకే ఆవేశాలకు లోనై యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని జాతీయ మానవ హక్కుల సంఘం మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బురి వెంకటేష్ యాదవ్ సూచించారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎంతో కష్టపడి తల్లిదండ్రులు మనల్ని పెంచి పెద్దచేస్తే, యువతపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలు చేస్తున్నారని, ఇంట్లో జరిగే చిన్న గొడవకే ఆత్మహత్యలు చేసుకోవడం, పగలు, ప్రతీకారంతో ఇతరుల ను చంపడం లాంటి దురాక్రమణ పనులకు పూనుకోవడం ధారుణమన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే, గొడవలు ఉంటే పెద్దల సమ క్షంలో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, బాధలు కలిగిన గాని ఆత్మ స్థైర్యం కోల్పోకుండా తనపై ఒక కుటుంబమే ఆధారపడి ఉందని గుర్తుంచుకోవాలన్నారు. కుటుంబ గొడవల కారణంగా ఇటీవలే శివ్వంపేట మండ లం నానుతండాలో అన్నను, తమ్ముడు కరెంట్ షాక్‌తో చంపడం ధారుణమని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నిబద్ధతతో ప్రతి ఒక్కరు ఆలోచించాలన్నారు. గ్రామాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు, కళాజాత బృందాలు కూడ అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలలో చైతన్యం తీసుకురావాలని సూచించారు.

మృతుల అంతిమయాత్రలో పాల్గొన్న కంటారెడ్డి, తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని బచ్చురాజు పల్లి గ్రామానికి చెందిన సురేష్ రోడ్డు ప్రమాదంలో మరణించగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి, తిరుపతి రెడ్డి, హాజరై పార్థివ దేహానికి నివాళులర్పించి అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరమన్నారు. మృతుని కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఓదార్చారు. చల్మెడ గ్రామానికి చెందిన భాజ దుర్గయ్య అనారోగ్యంతో మృతిచెందగా ఆయన అంతిమయాత్రలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్ర మంలో మండల ముఖ్య నాయకులు కల్వకుంట పిఏసిఎస్ చైర్మన్ అందే కొండల్ రెడ్డి, కల్వకుంట మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, నిజాంపేట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు చలమేటి నాగరాజు, లక్ష్మీ నరసింహులు, చల్మెడ మాజీ ఎంపీటీసీ బాల్రెడ్డి, సంగు స్వామి, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మావురం రాజు, రెడ్డి శెట్టి రవీందర్, రమావత్ నరేందర్, ఆకుల మహేష్, బాజా రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజాంపేట



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన చిమ్మనమైన సురేష్ కుటుంబాన్ని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పరామర్శించారు. చిన్న వయసులో చనిపోవడం చాలా బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కలిగించాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో బిజ్జ సంపత్, నార్లాపూర్ మాజీ సర్పంచ్ గోపరి నరసింహులు, పప్పుల కిష్టారెడ్డి, బజార్ స్వామి గౌడ్, రమావత్ నరేందర్, శ్రీనివాస్ గౌడ్, తిప్పనగుల్ల మంగిలి పల్లి యాదన్న , యాదగిరి, సిహెచ్ నాగరాజు, బాల్ రెడ్డి, మావురం రాజు, సంఘ స్వామి, రెడ్డి శెట్టి రవీందర్, గేరిగంటి నర్సింలు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులలో మూడో వ్యక్తికి అవకాశం ఇవ్వద్దు

- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్



ఫిర్యాదుదారులు మూడవ వ్యక్తికి అవకాశం ఇవ్వవద్దని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్ఐ,, సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిశీలించి పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలిపారు.

గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులుగా చంద్రం కృష్ణ గౌడ్



నవతెలంగాణ-కౌడిపల్లి : గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులుగా చంద్రం కృష్ణ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమావేశంలో సమావేశం నిర్వహించగా అందులో మెదక్ జిల్లా అధ్యక్షుడిగా చంద్రం కృష్ణ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు. గ్రామాలలో బెల్ట్ షాపులు లేకుండా తమ వృత్తి కల్లు గీసే గౌడ కులస్తులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందించేందుకు సహకరిస్తానని ఆయన తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులను వదిలేసి కల్లు దుకాణాలపై దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదన్నారు. గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు విజయకుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్ర దుర్గ గౌడ్ జిల్లాలో ఉన్న గౌడ కులస్తులదరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కబేళాలకు అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

నవతెలంగాణ-ములుగు



అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న 34 గోవులను భజరంగ్ దళ్ శ్రేణులు ములుగు పట్టుకున్నారు. సోమవారం రోజున తెల్లవారుజామున ములుగు రాజీవ్ రహదారిపై సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ లోని కళేబాలకు గోవులను తరలిస్తుండగా భజరంగ్ దళ్ శ్రేణులు పట్టుకున్నారు. ఈ గోవులను పోలీస్ స్టేషన్ కి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఈ 34 గోవులను గోశాలకు తరలించినున్నట్లుగా భజరంగ్ నేతలు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా చట్టాల అమలుతో గోవధ నిర్మూలనకు కృషి చేస్తుండగా అక్రమార్కులు మాత్రం పట్టించుకోకుండా యధేచ్ఛగా తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున గోవుల రవాణాకు అడ్డుకట్టవేసేలా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఈ గోవులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

ప్రజా పాలన గ్రామసభలు సజావుగా నిర్వహించాలి

సిద్దిపేట జిల్లా డిపిఓ దేవకీదేవి

నవతెలంగాణ-మద్దూరు



ఈనెల 21 నుంచి జరిగే ప్రజాపాలన గ్రామసభలను సజావుగా నిర్వహించాలని. సిద్దిపేట జిల్లా డిపిఓ దేవకీదేవి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మద్దూరు మండలంలోని మద్దూరు, ధర్మారం, గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన గ్రామసభలను సజావుగా నిర్వహించాలని, దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని ఆమె కోరారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఎంపిఓ వీరరాజు, పంచాయతీ కార్యదర్శులు గద్ద వెంకటేశ్వర్లు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణపై బెదిరింపు వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయాలి

నవతెలంగాణ-దుబ్బాక



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగపై బెదిరింపు వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పసుల రామ్మూర్తిని వెంటనే అరెస్టు చేయాలని, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇస్తారిగల్ల ఎల్లం మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పీ దుబ్బాక కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఐ గంగరాజుకు ఫిర్యాదు చేయడం జరిగింది. వారి వెంట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు చెక్కపల్లి మహేష్, జనగామ విజయ్ కుమార్, చెక్కపల్లి రాజమల్లు, కట్కూరి రామచంద్రం, ఇస్తారిగల్ల యాదగిరి పలువురున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలి

- యూత్ కాంగ్రెస్ సెక్రటరీ ఏరాబోలు రాజి రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు చూసి ఓర్వ లేక బీఆర్ఎస్ చేస్తున్న అబద్దపు ప్రచారాలు మానుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఏరాబోలు రాజి రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మీద సభ్య సమాజం తలదించుకునే విధంగా ఆధారాలు లేని మాటలు మాట్లాడుతూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు కాని హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసిన ఘనత మీకే దక్కిందన్నారు. కమిషన్లతో కాంట్రాక్టులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఘనత మీదేనన్నారు. ఎవరినైనా విమర్శించే ముందు మీ కాలంలో చేసిన పాలనను గుర్తుతెచ్చుకోవాలని, అవసరమైతే సూచనలు చేయాలని, ఇష్టారితిగా మాట్లాడడం సరికాదన్నారు. ఆధారం లేని మాటలు మాట్లాడి, విలువ లు లేని రాజకీయాలు చేయడం మంచిది కాదని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్య క్షుడు అజ్మత్ అలీ, టౌన్ అధ్యక్షులు సాదుల సాయి ప్రతాప్, మోత్కూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచే ఆలోచనను విరమించుకోవాలి



నవతెలంగాణ-కొండపాక : ఉద్యోగ విరమణ వయస్సు పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని టి పి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి సత్య కృష్ణ, కుకునూరు పల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు రామచంద్రం, ఆంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కుకునూరు పల్లిలో టి పి టి ఎఫ్ వారు రూపొందించిన క్యాలెండర్‌ను ఎంఈఓ బచ్చలి సత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ కొండి మల్లారెడ్డి, సంఘం నాయకులు బాలకిషన్ శంకరయ్య తదితరులు ఉన్నారు.

ఎన్నవెల్లి రాజమౌళికి సన్మానం

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని నీలకంఠేశ్వర దేవాలయంలో సిద్దిపేట జంగామ సమాజ 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బాల సాహిత్య పురస్కారం అందుకున్న రాజమౌళిని సమాజం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షులు నగేష్, సభ్యులు ఆనందయ్య, శశిధర్, ఉమాపతి, విదుమౌళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మనోవికాస పాఠశాల విద్యార్థులకు అన్న వితరణ

నవతెలంగాణ-సిద్దిపట



జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం, వాసవి క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాస లక్ష్మి బాలయ్య పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో అభయజ్యోతి మనోవికాస కేంద్రంలోని విద్యార్థులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి మర్యాల వాణి, వాసవి క్లబ్ అధ్యక్షులు మురంశెట్టి కుమార్, చిగుళ్ళపల్లి మంజుల, సత్యనారాయణ, ధనలక్ష్మి, బాలయ్య, రూపా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర దేవాలయ హుండీ లెక్కింపు


నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 113 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు నిర్వహించినట్లు కార్యనిర్వాహాధికారి విశ్వనాథ్ శర్మ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పర్యవేక్షకులు విజయలక్ష్మి, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త, చైర్మన్ తిరునగరి వెంకట రమేష్ విష్ణుల పర్యవేక్షణలో వికాస్ తరంగిణి, కోటిలింగాల సేవా సమితి, అర్చక, సిబ్బంది, ఇతర దేవాలయాల సిబ్బంది వారి సమక్షంలో హుండీ లెక్కింపు జరపగా రూ 15,25,194/- వచ్చాయని, వాటిని బ్యాంకులో జమ చేయడం జరిగింది అని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో రోజుకో రైతు బలి

నవతెలంగాణ-నంగునూరు



కాంగ్రెస్ పాలనలో రోజుకో రైతు బలి అవుతున్నారని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జి ఆకు బత్తిని రాము, నియోజకవర్గ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్, నంగునూరు మండల సమన్వయకర్త తొప్పెట పర్శరాములు, యువజనాయకులు ఆవుల పర్శరాములు, సందబోయిన రమేశ్ లు ఆరోపించారు. తెలంగాణలో అన్నదాతల మరణ మృదంగం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అరకొర రుణమాఫీతో రుణ బాధలు భరించలేక రైతులు ఆత్మహత్య పాల్పడుతున్నారని విమర్శించారు. 13 నెలలు గడుస్తున్నా ఇంకా అప్లికేషన్ స్వీకరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు.

గురుకులాల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-కొండపాక



గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందగోరేవారు తమ తమ దరఖాస్తులను ఆన్ లైన్‌లో చేసుకోవాలని ప్రభుత్వ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ శివప్రసాద్ తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశం కోసం ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ లోపు తమ దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. కులం, ఆదాయం, ఆధార్, బర్త్ సర్టిఫికెట్ ఫోటోలతో ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

23వ తేదీన సబ్ జూనియర్ విభాగంలో ఎంపికలు

నవతెలంగాణ-గజ్వేల్



ఈ నెల 23వ తేదిన జరిగే సబ్ జూనియర్ విభాగంలో ఎంపికలకు అభ్యర్థులు బోనాఫైడ్, ఆధార్ కార్డులతో 16 సంవత్సరాలలోపు ఉండాలి, బరువు బాలురు, బాలికలు మించకుండా ఉండాలి. రిజిస్ట్రేషన్ ఫీజు 50రుపాయలు చెల్లించి సెలక్షన్లలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తెలిపారు. సీనియర్ పురుషుల విభాగంలోఎంపికలు సీనియర్ పురుషుల విభాగంలో 85 కేజీలకు మించకుండా ఉండాలన్నారు. ఈ ఎంపికలు గజ్వేల్‌లో గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు సీనియర్ మెన్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ వికారాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు పూర్తి వివరాలకు: శ్రీకాంత్ : 95508 47409, మహేష్ 88857 28286, నరేంద్ర బాబు : 89196 79704 సంప్రదించాలన్నారు.

నేస్తమా.. కుశలమా!

46 ఏళ్ల తర్వాత కలిసిన 1979 బ్యాచ్ విద్యార్థులు

నవతెలంగాణ-దుబ్బాక



వారంతా 46 ఏళ్ల కిందట ఒకే స్కూల్‌లో విద్యనభ్యసించారు. దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. వృత్తిపరంగా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. తమకు విద్యనేర్పిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మళ్లీ కలుసుకొని, నాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1978-79 బ్యాచ్‌కు చెందిన ఎస్ఎస్ సీ విద్యార్థులు ఒకే వేదికను పంచుకున్నారు. మొత్తం 48 మంది హాజరైన ఈ సమ్మేళనంలో నేస్తమా కుశలమా అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. మరణించిన 14 మంది మిత్రులకు నివాళులర్పించారు. మిత్రుడు మచ్చ రాజమౌళి రచించిన "స్నేహానికన్న మిన్న వేరేది లేదులే" అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు సిద్దిపేట ఎంఈఓ సత్తు యాదవరెడ్డి, కొండ శ్రీనివాస్, ఆంజనేయులు, రామస్వామి, రామ్మోహనాచార, అనిల్, బాల్ నారాయణ, అంబిక రాజు, సిద్ది రాములు, కాల్వ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి







నవతెలంగాణ-మర్కూక్

ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని మర్కుక్ ఏఎస్ఐ రవీందర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని కర్కపట్ల గ్రామంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల భాగంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు ఉన్నవారు డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్నవారికి ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు నడపోద్దని హెచ్చరించారు. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదం మాత్రమేనని, వాహనదారులు తప్పకుండా రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీగా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలిపారు. నిద్రలేమి తనము ఓవర్ స్పీడ్, అజాగ్రత్తగా, వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, హెూంగార్డు రాములు, తదితరులన్నారు.

నవతెలంగాణ-తొగుట

రోడ్డు నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని తొగుట ఎఎస్ఐ రాంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సిబ్బందితో కలిసి ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు, యువకులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా వాహనాలు నడుపాలన్నారు. మద్యం సేవించి ఆటోలు నడపవద్దని సూచించారు. పరిమితికి మించి ఆటోలో ప్యాసింజర్‌లో ఎక్కించుకోవద్దని అన్నారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, ఆటో డ్రైవర్లు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల పురస్కరించుకుని సోమవారం రాజగోపాల్ పేట ఎస్సై అసీఫ్, సిబ్బందితో కలిసి నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. నంగునూరు మండల కేంద్రంలో హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అసీఫ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎప్పుడు కూడా రోడ్డుకు ఎడమవైపు నడవాలని, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని తెలియజేశారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఒక రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా, తేరుకోలేని క్షోభకు గురి చేస్తుందన్నారు. త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, వాహనం నడిపేటప్పుడు వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్ , ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

కటిక కులస్తులను సూర్యవంశ ఆరెకటికలుగా ధృవీకరించాలి

నవతెలంగాణ-గజ్వేల్



కటిక కులస్తులను సూర్యవంశం ఆరికటికలుగా ధృవీకరించి కుల ధృవీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు గజ్వేల్ సూర్యవంశం అరెకటిక నాయకులు నర్సింగరావు వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 1977 నుండి ఆరెకటిక అని తమ కులానికి పేరు వాడుకలోకి వచ్చిందని, అప్పటివరకు వివిధ పేర్లతో చలామణి కాగా 1977లో విద్యా కమిషన్ చేసిన సర్వేలో నిజం తెలుసుకొని తెలుసుకొని కటిక కులాన్ని ఆరెకటిక కులంగా ఉమ్మడి రాష్ట్రంలో పేరును కొనసాగించారన్నారు. ఆ తర్వాత 1994- 95లో మరికొందరి ప్రయత్నాల వల్ల పేర్లు మార్పు జరిగిన చివరికి ప్రభుత్వం నియమించిన సుబ్రహ్మణ్య కమిషన్ సూర్యవంశం, ఆరెకటిక కటిక పదానికి పర్యాయాలుగా వాడాలని వెల్లడించినట్లు తెలిపారు. ఇప్పటివరకు కటిక కులస్తులు ఈ విధంగా కుల పేరును వినియోగించలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా సూర్యవంశ ఆరెకటిక ఒకే కులం గా పరిగణించి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే విధంగా బీసీ కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పొట్ట స్వామి కమిషన్ వెల్లడించిన విధంగా ఆరెకటికలను బిసి డి నుండి బీసీఏలోకి మార్చి సూర్యవంశం ఆరికటికులకు న్యాయం చేకూర్చాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లరేషన్ ఇంప్లిమెంట్ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని బీసీలకు ఇచ్చే రిజర్వేషన్ 42 శాతానికి పెంచాలని కమిషన్కు నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ కార్ రమేష్, జమాల్పూర్ ప్రదీప్, కళ్యాణ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేత

నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి మండలం మేదినిపూర్ పాఠశాలలో పనిచేస్తున్న తిరుమల వెంకటరమణ అనే ఉపాధ్యాయుడి సౌజన్యంతో 50 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను సోమవారం అందజేశారు. డ్రెస్సుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కొండపాక మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి , కుకునూరుపల్లి మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్యలు మాట్లాడుతూ పాఠ శాల ఉపాధ్యాయుడు వెంకట రమణ తన సొంత ఖర్చులతో ఆయన తండ్రి జ్ఞాపకార్థము విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందించడం అభినందనీయమ న్నారు. సమాజ సభ్యుల సహకారం ఉంటే ఏదైనా సాధించవచ్చున్నారు. గ్రామంలోని యువత తల్లిదండ్రులు అందరూ కలిసి ప్రభుత్వ పాఠశాలలో నమోదు పెంచేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం , ఉపాధ్యాయులు వెంకట రమణ, వెంకట లక్ష్మి శ్రీనివాస రెడ్డి, గ్రామస్తులు తల్లి దండ్రులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయునిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

















నవతెలంగాణ-సిద్దిపేట

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు తుక్కు గూడ ప్రధానోపాధ్యాయులు రాములుపై జరిగిన దాడికి నిరసనగా సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టి పి టి ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాములుపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎం వజ్రమ్మ ఎం గీతాదేవి, వెంకటరమణ, రవీందర్ రెడ్డి, దుర్గయ్య శ్రీదేవి, రాజకుమార్, రాజమోహన్ గౌడ్, సాగర్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

జేపీసీ ఆధ్వర్యంలో ..

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుక్కుగూడ ప్రధానోపాధ్యాయులు కే.రాములుపై జరిగిన మూఖ దాడికి నిరసనగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాల్గొని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరం మాట్లాడుతూ దుర్మార్గంగా, అనాలోచితముగా దాడి చేయడం అమానుషమని, సమాజాన్ని ఉత్తమ మార్గంలో నడిపించే ఉపాధ్యాయులను దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభు, మల్లయ్య శ్రీనివాస్ గౌడ్, అశోక్ రెడ్డి, వెంకటేశం, అంజిరెడ్డి, సుజాత, ఉదయం శ్రీ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ హమ్మద్, తప్పెట్ల యాదగిరిలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రక్షణ చర్యలు చేపట్టాలని, పాఠశాలలను కుల, మత, వర్గ రహిత కేంద్రాలుగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎం. కృష్ణ, జిల్లా కార్యదర్శి సీహెచ్.రామచంద్రం తదితరులు పాలోన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ఇటీవలే రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రధానోపాధ్యాయులు రాములపై జరిగిన భౌతిక దాడి నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు పలు పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పరిషత్ మండల పరిషత్ పాఠశాల చౌదర్పల్లి ఆవరణలో మధ్యాహ్న భోజన వేళ జరిగిన నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్న పిఆర్టియు సిద్దిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భాన్ని ఆయన మాట్లాడుతూ ఇటీవల రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ప్రధానోపాధ్యాయుడు రాములుపై భౌతిక దాడి జరిగిందన్నారు. ఉపాధ్యాయులపై భౌతిక దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఇలా దాడులు చేయడంఉపాధ్యాయ వ్యవస్థను అవమానించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఐ.వెంకటరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్, ప్రధానోపాధ్యా యులు జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు బుచ్చి రాములు కృష్ణారెడ్డి, శైలజ, వెంకటమ్మ శ్రీ పాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై దాడులకు పాల్పడిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బందారం ఉన్నత పాఠశాలలో సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చుండు రామచంద్రం , తపస్ రాష్ట్ర నాయకులు వంగ నర్సిరెడ్డి మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న రాముడు పై దాడి చేసినే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఎస్. బాల కనకయ్య, బి శ్రీనివాసరెడ్డి, పి.భాగ్యలక్ష్మి, ఎం మల్లారెడ్డి, సి.హెచ్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ అన్నారు. సోమవారం మండలంలోని బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుక్కుగూడ ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్ కుమార్,సంజీవ్, రాములు, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్,దివాకర్, రాజేందర్, కమలాకర్, అమరేందర్, ప్రసాద్, ఎం.వసంత, జి.వసంత, పావని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

రంగారెడ్డి జిల్లా మహేశ్వర్ మండలంలోని తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కంబలి రాములుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో భోజన విరామం సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వరదరాజు , డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రభాను , పి ఆర్ టి యు టి ఎస్ మండల అధ్యక్షులు కే శ్రీనివాస్ రెడ్డి, టి పి టి ఎఫ్ మండల బాధ్యులు బి చంద్ర రెడ్డి,డిటిఎఫ్ మండల బాధ్యులు మల్లేశం, నర్సింహులు, రవత్, ఉపాధ్యాయులు సంపత్, శిరీష, రవి,కవిత, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ప్రధానోపాధ్యాయులు రాములుపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం నంగునూరు మండలంలో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాలల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎనగందుల మనీష్ కుమార్, ఉపాధ్యాయులు తహసీన్ సుల్తానా, హర్షద్, సునీత, అశోక్, విజయ్ కుమార్, దత్తాద్రి, రామస్వామి, కిషన్, లింగం, నరేశ్, రాజ్ కుమార్, మహాదేవ్, బాబు పాల్గొన్నారు.

'వేలగొంతులు.. లక్షల డప్పులు' ప్రదర్శనకు తరలిరావాలి

నవతెలంగాణ-గజ్వేల్



ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 07న హైద్రాబాద్‌లో జరిగే వేల గొంతులు లక్ష డప్పులు సాంస్కృతిక మహాప్రదర్శన కార్యక్రమానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో గజ్వేల్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక సమావేశాన్ని గజ్వేల్ మండల ఉపాధ్యక్షుడు సంగపురం రవి మాదిగ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మైస రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముం ద్రాతి కృష్ణ మాదిగ, జిల్లా కార్యదర్శి ఉబ్బని అంజనేయులు అసెంబ్లీ కన్వీనర్ శనిగరి రమేష్ మాదిగ హాజరై.. గజ్వేల్ పట్టణానికి సంబంధించిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా ప్రదర్శన విజయవంతం చేయడానికి ఈనెల 25న సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే సన్నాహక సమావేశం సక్సెస్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు నత్తి నరేష్ మాదిగ,కుల పెద్దలు సంఘపురం ఎల్లయ్య, దయ్యాల యాదగిరి యువకులు విద్యార్థులు పెద్దలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | 21 జనవరి 2025 | www.navatelangana.com

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

నవతెలంగాణ-దుబ్బాక



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల లబ్ధిదారుల వివరాల నమోదులో పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో 7, 9 వార్డుల్లో కొనసాగుతున్న నూతన రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ కే.రమేష్ కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అయన వెంట మున్సిపల్,రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



వివాహం జరిగిన వ్యక్తిని ప్రేమించిందని తల్లిదండ్రులు మందలించడంతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన గుండారం అంజలి(20) అదే గ్రామానికి చెందిన అయ్యాగల్ల నాగరాజుతో ప్రేమలో పడి మూడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. అప్పటికే నాగరాజుకి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంజలి తల్లిదండ్రులు కూతురు కనిపించడం లేదని రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో యువతి కనపడడం లేదని కేసు నమోదు చేశారు.పోలీసులు అంజలి నాగరాజు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. గ్రామస్తులు కుటుంబ సమక్షంలో ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి ఎవరింటికి వారిని పంపించారు. దానితో సమస్య సద్దుమణిగింది. ఇటీవల మళ్ళీ అంజలి నాగరాజుతో రహస్యంగా ఫోన్ మాట్లాడుతుందని కుటుంబ సభ్యులకు తెలియడంతో అంజలిని మందలించారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు అంజలి కూడా పనికి వెళ్ళింది.అంజలి మధ్యాహ్నం భోజనం చేయడానికి అని ఇంటికి వచ్చింది. కుటుంబ సభ్యులు మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురి చెందిన అంజలి మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తిరిగి పొలం వద్దకు రావడంలేదని అనుమానంతో కుటుంబ సభ్యులు అంజలికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. అనుమానంతో అదే గ్రామంలో ఉంటున్న అంజలి సోదరికి ఫోన్ చేయగా ఆమె వచ్చి చూసేసరికి అంజలి ఇంట్లో ఉరివేసుకుంది. వెంటనే తల్లిదండ్రులకు విషయం తెలుపగా వచ్చి చూసేసరికి అప్పటికే అంజలి మృతి చెందింది. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి బీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

కాలువలో పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి.

నవతెలంగాణ-తొగుట



ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన లింగాల స్వామి ఇటీవల కాలంలో ప్రమాద వశాత్తు మురికి కాలువలో పడి గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆర్విఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్ల వారుజామున మృతి చెందాడు.

ఇందిరమ్మ గ్రామసభలు ఏర్పాటు



నవతెలంగాణ-గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పట్టణ ప్రజలు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు గ్రామసభను చాకలి ఐలమ్మ భవనంలో నిర్వహిస్తుండగా.. రెండో వార్డు క్యాసారం వార్డ్ ఆఫీసు వద్ద నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మూడో వార్డు ప్రజ్ఞాపూర్ పోచమ్మ గుడి వద్ద నిర్వహిస్తున్నామన్నారు. నాలుగో వార్డ్ హైస్కూల్ ప్రజ్ఞాపూర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐదో వార్డు గ్రామసభ వార్డు ఆఫీస్ వద్ద నిర్వహిస్తున్నామన్నారు.

బ్యాటరీల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-వర్గల్ : వరుసగా బ్యాటరీల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని గౌరారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ గ్రామంలో ఈనెల 18న రెండు బ్యాటరీలు చోరీకి గురైనట్టు బాధితులు కంప్లైంట్ చేశారు. సోమవారం రోజున ఉదయం సింగయపల్లి చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఓ వాహనంలో బ్యాటరీలు కనిపించాయి. దాంతో పోలీసులకు అనుమానం వచ్చి వాహనదారుడైన బోయిన్‌పల్లికి చెందిన సందీప్‌ను విచారించగా ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని 9 బ్యాటరీలు, గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో 3 బ్యాటరీలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దాంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గౌరవరం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు



నవతెలంగాణ-మర్కుక్ : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందే వరకు ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ అన్నారు. సోమవారం ఆయన పాములపర్తిలో మాట్లాడుతూ.. కొత్త రేషన్‌కార్డుల లిస్టులలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కులగణన, సోసియా ఎకనమిక్ సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేయడ జరిగిందన్నారు.రేషన్ కార్డులు రాని పక్షంలో గ్రామ సభల్లో మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డు అందజేస్తామన్నారు. నేటి నుండి 24 వరకు జరిగే గ్రామసభలకు అందరూ హాజరుకావాలన్నారు.

నేటి నుంచి లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

నవతెలంగాణ-కొండపాక : పలు పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. 21న మంగళవారం మండలంలోని వెలికట్ట, దర్గా, గిరాయిపల్లి, రాంపల్లి, దమ్మకపల్లి, విశ్వనాథపల్లి గ్రామాల్లో 22న మర్పడగ, దుద్దెడ, కొండపాక గ్రామాల్లో 24న బందారం, అంకిరెడ్డిపల్లి , ఖమ్మం పల్లి, జప్తి నాచారం, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో 24న సిరసనగండ్ల గ్రామంలో గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీవో పేర్కొన్నారు. కుకునూరు పల్లి మండలంలో 21న తిప్పారం , కోనాయిపల్లి, రాయవరం, 22న మేదిని పూర్ , మాత్ పల్లి, మంగోల్, రామచంద్రపూర్, ముద్దాపూర్ , 23న లకుడారం, సింగారం, ఎర్రవల్లి, చిన్న కిష్టాపూర్, 24న కుకునూరు పల్లి, బొబ్బాయిపల్లి, ఎల్లాయిగూడ , పిటి వెంకటాపూర్ గ్రామాల్లో గ్రామసభ జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

మండల గ్రామ సభల షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ-తూప్రాన్ : తూప్రాన్ మండలంలోని గ్రామ పంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 4 ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కొరకు నిర్వహించే గ్రామసభల షెడ్యూల్ ఎంపీడీవో కె.శేషాద్రి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 21, 22, 23 తేదీలలో మూడు రోజులపాటు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కొరకు నిర్వహించే గ్రామ సభలలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.శేషాద్రి కోరారు.

అర్హులు దరఖాస్తులు చేసుకోవచ్చు

నవతెలంగాణ-బెజ్జంకి : 26 నుండి ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,నూతన రేషన్ కార్డుల జారీ సంక్షేమ పథకాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవచ్చునని ఇంచార్జీ ఎంపీడీఓ అంజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.నేటి నుండి మండలంలో 23 వరకు గ్రామ సభలు నిర్వహించి సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఇంచార్జీ ఎంపీడీఓ తెలిపారు.నేడు లక్ష్మీపూర్, గుండారం, పెరుకబండ, దేవక్కపల్లి, వీరాపూర్, తోటపల్లి, దాచారం, ముత్తన్నపేట, 22న వడ్లూర్, తలారివానిపల్లి, గూడెం, చీలాపూర్, గాగిల్లపూర్, బెజ్జంకి క్రాసింగ్, నర్సింహుల పల్లి,రాంసాగర్,23న గుగ్గిల్ల,తిమ్మాయిపల్లి, కల్లేపల్లి,చీలాపూర్ పల్లి,బెజ్జంకి,బేగంపేట,రేగులపల్లి,పోతారం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు అంజయ్య తెలిపారు.

పసుపు మయమైన మల్లన్న ఆలయం



- ఘనంగా పెద్దపట్నం అగ్నిగుండాలు
- మల్లన్న నామస్మరణతో మార్మోగిన ఆలయం
- పసుపుమయమైన తోటబావి ప్రాంగణం

నవతెలంగాణ-కొమురవెల్లి

పట్నం వారం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న ఆలయం మల్లన్న భక్తుల శివ సత్తులతో బండారు (పసుపు) మయమైంది. పంచవర్ణాల పెద్ద పటాన్ని దాటుకుంటూ.. అగ్నిగుండ ప్రవేశం చేస్తూ మేడలమ్మ, కేతమ్మ సమేత మల్లికార్జునుడిని దర్శించుకున్నారు. సోమవారం పెద్దపట్నం అగ్నిగుండాలతో మల్లన్న క్షేత్రంలో జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభమైయ్యాయి. .ఆలయ తోటబావి ప్రాంగణంలో కళ్యాణ మండపంవద్ద అగ్నిగుండాలు, పెద్దపట్నం నిర్వహించడంతో మల్లన్న నామస్మరణంతో మారుమోగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన మానుక పోచయ్య యాదవ్ కుటుంబ సభ్యులు, దుర్గాప్రసాద్ యాదవ్, యాదవ సంఘం సభ్యులు, శివసత్తులు, భక్తుల ఆధ్వర్యంలో పెద్దపట్నం, అగ్నిగుండాలను ఘనంగా నిర్వహించారు. అగ్నిగుండాలనూ పెద్దపట్నంను తిలకించేందుకూ భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అధికారులు భక్తులకోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలలో శివసత్తులు, భక్తులు బండారు (పసుపు) చల్లుకోవడంతో ఆలయ పరిసరాలు పసుపు మయమయ్యాయి. హైదరాబాద్ యాదవసంఘం ఒగ్గుపూజాలు పంచవర్ణాలతో (పసుపు, కుంకుమ,, తెల్లపిండి, ఆకుపచ్చ, సునేరు) 21 వరుసలతో పెద్దపట్నం వేశారు అదే సమయంలో . అగ్నిగుండాలకోసం సమిదలు పేర్చీవాటిని భగభగ మండేనిప్పు రవ్వలుగా తయారు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌తో పాటు అర్చకులు ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా పెద్దపట్నంకి చేర్చి యాదవ సాంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు (కల్యాణం) నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు అగ్నిగుండాలు దాటిన తర్వాత గ్యాలరీలలోని భక్తులు, శివసత్తులు యాదవ భక్తులు అగ్నిగుండాలను దాటూతూ స్వామిని దర్శించుకున్నారు.. అనవాయితీ ప్రకారంగా ఆలయ ఈఓ రామాంజేయులు ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ దర్మకర్తలు హైదరబాద్ కు చెందిన యాదవ భక్తులకు, శివసత్తులకు కొత్త బట్టలు పెట్టిఘనంగా సన్మానించారు.



పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం.

ఆలయతోట బావి ప్రాంగణంలో పట్నం వారాన్ని పురస్కరించుకొని అగ్నిగుండాలు, పెద్దపట్నంను దృష్టిలో ఉంచుకొని సోమవారం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మొదటి వారం, అగ్నిగుండాలు,పెద్దపట్నం సందర్భంగా 500 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, మూడు రోజులనుంచి బందోబస్తులో పాల్గొన్న పోలీసులుకు ధన్యావాదాలు తెలిపారు .

ఇందిరమ్మ అత్మీయ భరోసా అమలు చేయాలి

నవతెలంగాణ-కొండపాక



మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు ఇందిరమ్మ అత్మీయ భరోసా పథకాన్ని వర్తింప చేయాలని, నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఉపాధి హమీ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజిని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చెస్తూ దళిత బహుజన ఫ్రంట్ అధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా కార్యాలయం ఎదుట నిర్వాసితులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు గత నాలుగేండ్లుగా ఉపాధి హమీ పనులు కల్పించకుండా చట్టాన్ని ఉల్లంఘించారన్నారు. ఉపాధి హమీ పనులు కల్పించకపోవడం వల్ల ప్రస్తుతం ప్రభుత్వం కూలీలకు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులు కాకుండా పోయారన్నారు. ఇటీవల మున్సిపాల్టీలో కలిపిన గ్రామాలకు ప్రత్యేక పరిస్థితుల్లో అమలు చెస్తున్నట్లే మల్లన్నసాగర్, రంగనాయక్ సాగర్,కొండపొచమ్మ సాగర్ తదితర ప్రాజెక్టుల భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వమే భూమిని స్వాధీనం చేసుకున్నందున నిర్వాసితులు భూమిలేని కూలీలుగా మారారన్నారు. భూ సేకరణ చట్టం 2013 చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజిని వేములఘాట్ పరిధిలోని తుర్క బంజెరెపల్లికి చెందిన 44 మంది వడ్డెర కులస్తులకు ప్లాట్‌లను రిజిస్ట్రెషన్ చేసి మూడేండ్లు దాటినా.. నేటికి పొజిషన్ చూపించలేదన్నారు. 16వందల మంది మల్లన్నసాగర్ నిర్వాసితులకు ప్లాట్‌లను చూపించలేదన్నారు. దాదాపు 600 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయలేదన్నారు. దాదాపు 800 మంది ఒంటరి మహిళలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజీ అమలు చేయకుండా గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. 400 ఎకరాలకు నష్టపరిహారం నేటికి అందించలేదన్నారు. ఒంటరి మహిళలకు, 18 సంవత్సరాలు నిండిన కొంత మంది వయోజనులకు సైతం అర్ అండ్ అర్ ప్యాకెజిని అమలుచేయలేదన్నారు. ఈ కార్యక్రమంలోలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు ,హైకోర్టు న్యాయవాది దివాకర్ నిర్వాసితులు నర్సింలు,కనకయ్య,రుక్కయ్య,నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల కోసం ఈనెల 23న జాబ్‌మేళా

టీజీఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్

నవతెలంగాణ-జహీరాబాద్

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈనెల 23న జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్టు టీజీఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ అన్నారు. మహమ్మద్ ఇమ్రాన్‌తో కలిసి తన నివాసంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి, మాజీ మంత్రి కీర్తిశేషులు మహమ్మద్ ఫరీదోద్దీన్ తమకు ఎల్లవేళలా విద్యా ఉపాధి ఉంటేనే నియోజకవర్గం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పదేపదే చెప్పేవారన్నారు. ఆయన చూపిన బాటలోనే వారి జ్ఞాపకార్థం ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ కళ్యాణ మండపంలో జరగనున్న ఈ జాబ్‌మేళాలో సుమారు 100 నుంచి 110 పరిశ్రమలకు సంబంధించిన హెచ్‌ఆర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొంటారన్నారు. తాను ఇండస్ట్రియల్ చైర్మెన్‌గా ఉన్న ప్పుడు కొద్ది సమయంలోనే చాలామంది పరిశ్రమల నిర్వాహ కులు తమ వద్దకు వచ్చి పలు విషయాలపై చర్చించారన్నారు. అదే సమయంలో సంగారెడ్డి జిల్లాలో పెద్దమొ త్తంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అడగులు వేశామన్నారు. ఏడో తరగతి నుంచి పీజీ చదివిన వరకు వంటి వారందరికీ.. వారి స్థాయిని బట్టి ఉద్యోగాలను కల్పి స్తారన్నారు. ఎనిమిది వేల నుంచి లక్ష రూపాయల వరకు నెలకు జీతం చెల్లించేందుకు కూడా పరిశ్రమల వారు ముం దుకు వచ్చారన్నారు. ఇప్పటికే తమ వద్దకు మూడువేల వర కు దరఖాస్తులు వచ్చాయని.. ఇంకా దరఖాస్తులు వస్తూనే ఉన్నాయన్నారు. వాటిని కూడా పరిగణిలోకి తీసుకొని 23వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి అక్కడికక్కడే జాబ్‌కార్డులను కూడా అందిస్తామన్నారు. ఈ సదావకాశాన్ని జహీరాబాద్ నియోజకవర్గంతో పాటు సంగారెడ్డి జిల్లాలోని యువతీ యువకులు, నిరుద్యోగులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కీర్తిశేషులు ఫరీదోద్దీన్ అభిమానులు మహమ్మద్ కుతుబ్ బోధిన్, బాల్రెడ్డి, రాములు నేత, జహంగీర్, మోతిరామ్, మహమ్మద్ బాసిత్, తాజుద్దీన్, ఫిరోజ్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.



సంగుపేట్ బ్రిడ్జి పైనుంచి కింద పడిన లారీ

3 గంటల పాటు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-జోగిపేట

నాందేడ్-ఆకోలా జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున బండల లోడ్‌తో(కర్నూల్) బేతంచర్ల నుంచి రాజస్థాన్ వెళ్తున్న లారీ ఆందోల్ మండలం సంగుపెట్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న వంతెన పై నుంచి అదుపుతప్పి కింద పడింది. దాంతో లారీలో ఉన్న డ్రైవర్ షాకీర్, క్లినర్ ధర్మేందర్ సింగ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ షాకీర్ సుమారుగా 3 గంటల పాటు ముందు భాగ ంలోని క్యాబిన్‌లో ఇరుక్కుని పెద్దగా అరుపులు పెట్టాడు. విషయం తెలుకున్న జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్సై పాండు లా ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరు కొని సహయక చర్యలు చేపట్టారు. లారీలో ఇరుక్కున్న డ్రైవ ర్‌ను హెూమ్ గార్డు శ్రీశైలం తన భుజంపై వేసుకొని బయటకు తీసుకొచ్చి, అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ధైర్యంగా వెళ్లిన హెూమ్ గార్డును పలు వురు అభినందించారు. లారీ కింద పడ్డ సమయంలో ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులు గాని, ఇతర వాహ నాలు కానీ వెళ్ళకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు. ఒకవేళ వాహనాలు వెళ్లి ఉంటే బండల కింద పడి పెద్ద ప్రమాదం జరిగేది. డ్రైవర్ షాకీర్ కు కాళ్లు విరగడంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం సంగారెడ్డి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు జోగిపేట పోలీసులు తెలిపారు.



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ డ్రగ్స్ వ్యాపారం

- ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన నిందితుడు
- 120 మిల్లీ గ్రాముల ఎండిఎంఎ కిస్టల్స్ స్వాధీనం
- డ్రగ్ విలువ రూ.21 లక్షలు

నవతెలంగాణ-సంగారెడ్డి

లక్షల జీతం వస్తున్నా.. అదనపు సంపాదన కోసం ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ డ్రగ్స్ సరఫరా చేస్తుండగా డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. జమ్ముకాశ్మీర్‌కు చెందిన హర్షత్‌సింగ్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో వస్తున్న జీతామంతా డ్రగ్స్‌కే ఖర్చువుతుండడంతో తానే డ్రగ్స్ వ్యాపారీగా మారి తోటి ఉద్యోగులకు, ఇతరులకు డ్రగ్స్‌ను సరఫరా చేసే స్థాయికి ఎదిగాడు. డ్రగ్స్ కోసం మహారాష్ట్ర పూణే ప్రాంతానికి టాటా కారులో వెళ్లి అక్కడి నుంచి 120 మిల్లీ గ్రాముల ఎం డిఎంఎ క్రిస్టల్స్ డ్రగ్స్‌ను తీసుకొని హైదరాబాద్‌కు వస్తుం డగా.. సంగారెడ్డి డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు కలిసి సంగారెడ్డి మల్కాపూర్ ఫ్లైఓవర్ తనిఖీలు నిర్వహిం చి వాహనాన్ని పట్టుకున్నారు. ఆ వాహనంలో 120 మిల్లీ గ్రాముల ఎండిఎంఎ క్రిస్టల్ డ్రగ్స్ లభించాయి. డ్రగ్స్, వాహనం విలువ రూ.21.06 లక్షలు ఉంటుందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. డ్రగ్స్ పట్టుకున్న టీమ్‌లో సీఐ సిహెచ్. చంద్రశేఖర్, ఎస్సైలు బి.యాదయ్య, జి.హన్మంత్, పి.శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. డ్రగ్స్‌ను పట్టుకున్న డీటీఎప్, ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి, మెదక్ డిప్యూటి కమిషనర్ హరికిషన్, అసిస్టెంట్ కమిషనర్ జి .శ్రీనివాసరెడ్డిలు అభినందించారు.



రాహుల్ గాంధీపై అక్రమ కేసులు విడ్డూరం

నవతెలంగాణ- గజ్వేల్



పార్లమెంటు నాయకులు కాంగ్రెస్ ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు విడ్డూరం అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు తూముకుంట అంక్షారెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాహుల్ గాంధీ పోరాడుతున్నారన్నారు. ఇది జీర్ణించుకొని మోడీ ప్రభుత్వం.. రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు బనాయించాలని కుట్ర చేయడం సిగ్గుచేటన్నారు. ఇందిరాగాంధీ కుటుంబం ప్రజల కోసం పోరాటం చేసిందని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులంటే జీర్ణించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

నవతెలంగాణ-చేర్యాల



మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యా యులు, యూటీఎఫ్ మద్దూరు మండల అధ్య క్షులు రంగు రాజమల్లు గౌడ్ తన తండ్రి రంగు నర్సయ్య గౌడ్ జ్ఞాపకార్థం తను చదువుకున్న పోతిరెడ్డిపల్లి ఎంపీపీఎస్ విద్యార్థులకు సోమవారం ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్లేట్లు అందజేసిన రాజమల్లు గౌడ్‌కు పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్,ఉపాధ్యాయులు డి.అయిల్ రెడ్డి, ఈ. ఆంజనేయులు, కర్రోళ్ల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

నవతెలంగాణ-మర్కుక్



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలగా మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతు భరోసా ఎకరాకి రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి.. నేడు అధికారంలోకి రాగానే రైతుబంధు ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. ఒకే విడత రైతు రుణమాఫీ చేస్తా చేస్తామని చెప్పి.. నాలుగు విడతలుగా నామమాత్రంగా చేసి, ఇప్పటికీ రూ.2,లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను దగా చేయడం కాదా అని ప్రశ్నించారు. నాలుగో విడత రూణమాఫీ డబ్బులు ఇప్పటికీ బ్యాంకుల్లో రైతు ఖాతాల్లో జమ కాలేదన్నారు. ప్రతీ విషయంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తున్నదని దుయ్యబట్టారు. ఈ విషయాన్ని ప్రజల సహకారంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో నిలదీయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

గౌడన్నలకు కాటమయ్య కిట్లు పంపిణీ

నవతెలంగాణ-అక్కన్నపేట



మండలంలోని జనగా మ గ్రామంలో బీసీ వెల్ఫేర్ శాఖ సహకారంతో సేఫ్టీ కాటమయ్య కిట్లను సోమ వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ అధికారుల మహేష్, నవీన్ గౌడ్ల ఆధ్వర్యంలో 100 కిట్లను అందించి తాడిచెట్టు ఎక్కే టైంలో ప్రమాదాలు జరిగితే ఎలా కాపాడుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా శిక్షకులు మూల మల్లేశం, అంజి గౌడ్, పొన్నం వెంకటేశం, బత్తిని శ్రీనివాస్, తాళ్లపల్లి తిరుపతిలు గౌడన్నలకు ఈ కిట్స్ ఎలా ఉపయోగించాలనేది చెప్పారు. ఈ కార్యక్రమంలో రామవరం గౌడ సంఘ సొసైటీ అధ్యక్షులు రంగు యాదగిరి, అక్కన్నపేట అధ్యక్షులు తాళ్లపల్లి మల్లేశం, గౌరవెల్లి అధ్యక్షులు మంద శ్రీనివాస్, జనగామ అధ్యక్షులు బిక్షపతి, అంతకపేట అధ్యక్షులు బండి శ్రీను, గోవర్ధనగిరి అధ్యక్షులు గాదరవేణి కొమురయ్య, ఇతర కల్లు గీత కార్మికులు, తదితరులు, పాల్గొన్నారు.

రాఘవులు, పద్మశ్రీని కలిసిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలో కార్మిక కర్షక భవన్ ప్రారం భోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులుని జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సం ఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు పద్మశ్రీని కూడా కలిసి.. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని వారిద్దరిని కోరినట్టు జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పొన్నమల్ల యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందుకు వారు సానుకూలంగా స్పందించి, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల రాజమల్లు, రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ చైర్మన్ పుల్లగుర్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

టీఎంఎం ముంబై 2025లో సిద్ధిపేట రన్నర్స్ ప్రాబల్యం

నవతెలంగాణ -నంగునూరు



ప్రఖ్యాతి చెందిన టాటా ముంబై మారథాన్ (టీఎంఎం) 2025 పూర్తి మారథాన్ (42.195 కి.మీ.ల) రేసును సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్‌కు చెందిన పది మంది సభ్యులు ఆదివారం విజయవంతంగా పూర్తి చేశారని సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తుల బాపు రెడ్డి తెలిపారు. సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు ఎన్.రాజు, జి.అశోక్, హరి, రమేశ్, గోపాల్, జీవన్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, లింగారెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌లు భారతదేశంలోని ప్రతిష్టాత్మక రన్నింగ్ ఈవెంట్లలో ఒకటైన టాటా ముంబై మారథాన్‌లో పాల్గొనడం సిద్ధిపేటకు గర్వకారణమని తెలిపారు. టాటా ముంబై మారథాన్ ప్రపంచం నలుమూలల నుండి దిగ్గజ అథ్లెట్లను, రన్నింగ్ అభిమానులను ఆకర్షిస్తుందని తెలిపారు. ఈ మారథాన్ బాంద్రా-వోర్లి సీ లింక్, మరైన్ డ్రైవ్ వంటి ముంబై లోని ప్రసిద్ధ చిహ్నాలను కవర్ చేస్తుందన్నారు. కఠినమైన కోర్సుతో అందరికీ శారీరక సహన పరీక్షగా ఈ మారథాన్ నిలుస్తుంది అని తెలియజేశారు. అంతేకాక ఈ ఈవెంట్ ఏకతను ప్రోత్సహించి, ఫిట్‌నెస్‌ను పెద్ద స్థాయిలో ప్రదర్శిస్తుందని చెప్పారు. ఈ మారథాన్ లో భాగస్వామ్యం పాల్గొనే వారి వ్యక్తిగత విజయాలను మాత్రమే కాకుండా, సమాజంలోని అనేక మందిని ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని అవలంబించడానికి ప్రేరేపిస్తుందని వివరించారు. సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ ప్రఖ్యాత కార్యక్రమానికి సిద్ధం కావడానికి గొప్ప అంకిత భావాన్ని, క్రమశిక్షణను చూపారని తెలిపారు. సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్ తన సభ్యులకు మద్దతు ఇవ్వడంలో సిద్ధిపేటలో రన్నింగ్ సంస్కృతిని ప్రోత్సహించడంలో అంకిత భావంతో పనిచేస్తుందని తెలిపారు.రేసులో పాల్గొన్న రన్నర్లకు అభినందనలు తెలియజేశారు. రాబోయే ఈవెంట్లలో వారు మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

27న ఉచిత సంతాన సాఫల్యత శిబిరం

-వైద్య శిబిరం కో ఆర్డినేటర్ బోష ఆనంద్

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని రక్షిత కేర్ ఆస్పత్రిలో ఈనెల 27న ఫెర్టీ-9 సంతాన సాఫల్యత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కో ఆర్డినేటర్ బోష ఆనంద్ తెలిపారు.ఫెర్టీ-9 సంతాన సాఫల్యత ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ పూర్ణిమ ఉచిత వైద్య సేవలు, పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉచిత వైద్య శిబిరం వివరాలకు 8977758293 ఫోన్ నంబర్ ను సంప్రదించాలన్నారు.



సగర ఉప్పర సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి విద్యానగర్‌లో సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సోమవారం ఆవిష్కరించారు. ముందుగా సగర ఉప్పర సంఘం మహిళలు, సభ్యులు, ఎమ్మెల్యేను పుష్ప గుచ్ఛంతో సత్కరించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సగర ఉప్పర సంఘానికి తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఎలాంటి సమస్య ఉన్న తోడుగా ఉండి పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. సగర ఉప్పర సంఘ జిల్లా భవనానికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో స్థలం కోసం అప్లికేషన్ పెట్టుకున్నామని.. ప్రభుత్వం మారిందని.. అయినప్పటికీ సంఘ భవనానికి స్థలం కేటాయించడానికి కృషి చేస్తానన్నారు. వారి తరుపున పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. గతంలో వార్డుల్లో పర్యటించి సమస్యలను తెలుసుకొని సాధ్యమైనంత వరకు పరిష్కరిచామన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను ప్రస్తుత ప్రభుత్వం క్యాన్సల్ చేసిందని.. మళ్లీ ఆ పనులు ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మెన్‌లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, సగర ఉప్పర సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మురళీ కృష్ణ, కౌన్సిలర్ రామప్ప, ఉప అధ్యక్షులు రవి, వెంకటయ్య, ఆంజనేయులు, సగరమల్లేశం సగర, గోనే ప్రవీణ్ సగర, శ్రీనివాస్ సగర, పాండు సగర, సాయి కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండలం తాలెల్మా గ్రామ శివారులో ఈనెల 11న రాత్రి జరిగిన హత్య కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్టు జోగిపేట సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు స్థానిక కార్యాలయంలో సోమవారం వివరించారు. అందోల్ మండలం నాదులాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ను అందోల్ మండలం జోగుపేటలోని రిక్షా కాలనీకి చెందిన సద్దాం హుస్సేన్, ఇతని బావమరిది తాడిదాన్ పల్లి గ్రామం చెందిన యూనిస్‌లు మద్యం సీసాతో గొంతుపై దాడి చేసి, బండరాయితో ముఖంపై కొట్టి చంపారు. మృతుడు తాలెల్మ సమీపంలోని కల్లు దుకాణంలో కల్లు తాగేందుకు వెళ్లగా సద్దాం హుస్సేన్, యూనిస్‌లు కూడా అక్కడికి వెళ్లేవారు. వారికి ముగ్గురు అక్కడ పరిచయ మయ్యారు. మృతుడు లూడో గేమ్ ఆడుతుండగా తాము కూడా డబ్బులు పెడతామని వచ్చిన డబ్బులతో మందు తాపాలని తెలపడంతో గేమ్ అయిపోయిన తర్వాత మందు తాగేందుకు వెళ్లారు. అదే సమయంలో మృతుడి బైకు, సెల్‌ఫోన్‌ల పైన కన్నేసిన వారు అతనిని చంపి వాటిని తీసుకొని పరారయ్యారు. కేసు విచారణలో చుట్టుపక్కల గ్రామాలలో సీసీ కెమెరాలు పరిశీలించగా వీరిద్దరూ నిందితులుగా అనుమానించి విచారించడంతో హత్య చేసినట్టు ఒప్పుకున్నారు. సోమవారం వారిని అదుపులోకి తీసుకొని కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్టు సీఐ తెలిపారు. బైకు రికవరీ కాలేదన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా చంద్రశేఖర్‌ను గెలిపించాలి



నవతెలంగాణ-సదాశివపేట

రాబోయే మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి, రైతు బిడ్డ, ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది లంటు చంద్రశేఖర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ బీసీ సంఘం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల విజయకుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి, నిరుద్యోగ ఉద్యమాలు, ఉచిత విద్య, వైద్య, ఉపాధి కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. పట్టభద్రులందరు చంద్రశేఖర్‌కు మద్దతుగా ఉండాలని కోరారు.

ఐడిఎస్ఎంటి కాలనీలో నీటి కొరత తీర్చాలి

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ స్మార్ట్ సిటీలోని వార్డ్ నెం.12లో ఉన్న ఐడిఎస్ఎంటి కాలనీ వాసులు గత కొన్ని నెలలుగా తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మహ మ్మద్ నిసార్ స్థానికులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. దాంతో త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అలాగే వార్డుకు చెందిన ప్రజలు సయ్యద్ అహ్మద్, మహ్మద్ యాసఫ్, అయాబ్ ఖాన్, మహ్మద్ మౌలా (మెకానిక్), మహ్మద్ , ఫయాజ్ ఇతర కమ్యూనిటీ నాయ కులు, స్థానికులతో కలిసి, ప్రజల మద్దతును సంపాదించేందుకు సంతకాల ఉద్యమాన్ని చేపట్టారు.

గ్రామ సభలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి

- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఏర్పాటు చేస్తున్న గ్రామసభల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా నెలకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. పేదలకు రేషన్ కార్డులకు దూరం చేసే కుట్రలను కాంగ్రెస్ పార్టీ చేస్తుందని దీనిని ఏమాత్రం సహించబోమన్నారు. ఈ నెల 28 నుంచి నిర్వహించే గ్రామ సభల్లో సంక్షేమ పథకాలపై ప్రశ్నించాలన్నారు. పెంచుతామన్న పింఛన్ జాడ లేదన్నారు. వికలాంగులకు, వితంతువులకు, కళ్యాణ లక్ష్మీ, షాదు ముబారక్, కెసిఆర్ కిట్టు, మహిళలకు ఇందిరమ్మ భరోసా పథకాల గురించి మహిళలు గ్రామ సభలో నిలదీయాలని ఆయన కోరారు. ప్రజా పాలన పేరుట దరఖాస్తు సేకరించిన ప్రభుత్వం ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మంది ప్రజా పాలనలో రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకుంటే ప్రతి గ్రామానికి ఒకటి రెండు మాత్రమే లీస్టులో వచ్చినట్లు ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు పంగనామాలు పెడుతుందని ఆయన చెప్పారు. అంతేకాకుండా ప్రతి గ్రామంలో రైతులు 150 మంది వరకు రుణమాఫీ పూర్తి స్థాయిలో రాలేదని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పాండు గౌడు, కో ఆప్షన్ సభ్యులు ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్‌లను వెంటనే కన్వర్షన్ చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట ఉపాధ్యక్షులు నక్కల యాదవ రెడ్డి



నవతెలంగాణ-సిద్ధిపేట

విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కన్వర్షన్ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్కల యాదవ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపుల భాగంగా పట్టణంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద సిద్దిపేట జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో కీలకంగా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయడంలో తప్పేం లేదని, దాని వల్ల సంస్థకు ఎలాంటి భారం కూడా పడదన్నారు. శాశ్వత పని ప్రదేశాల్లో పర్మినెంట్ కార్మికులు ఉండాలని సుప్రీంకోర్టు, రాజ్యాంగం లో కూడా చెప్పిందన్నారు. అలాంటప్పుడు విద్యుత్ రంగంలో మాత్రం రెండు రూల్స్ అండ్ రెగ్యులేషన్ ఉండడం చాలా దారుణమన్నారు. వెంటనే ఆర్టిజన్ కార్మి కులందరిని రెగ్యులర్ పోస్టులో కన్వర్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు వెన్నంటే ఉండి, రైతాంగం అంతా కూడా మీకు మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జెఏసి రాష్ట్ర సహాయ కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా చైర్మన్ గుంటుపల్లి సుధాకర్, జిల్లా వైస్ చైర్మన్ కనకరాజు, జిల్లా కొకన్వినర్ సందీప్, సితారాంలు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవికుమార్ గౌడ్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణమే లక్ష్యం

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి
- రూ.67 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



నవతెలంగాణ-తొగుట

దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తొగుట మండలంలోని ఆరు గ్రామాల్లో రూ.67 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక ప్రత్యేక అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చందాపూర్ గ్రామానికి రూ.10 లక్షలు, ఎల్లారెడ్డి పేటకు రూ.10 లక్షలు, పెద్దమాసాన్‌పల్లికి రూ.15 లక్షలు, బండారుపల్లికి రూ.10 లక్షలు, ఘనపూర్‌కు రూ.10 లక్షలు, జప్తి లింగారెడ్డిపల్లి రూ.12 లక్షలు మొత్తం రూ.67 లక్షల నిధులతో పనులు ప్రారంభించామన్నారు. గత పదేళ్ల కాలంలో దుబ్బాక నియోజకవర్గాన్ని పూర్తిగా వెనుకబాటుకు గిరిచేశారని, దుబ్బాక కు వచ్చే నిధుల న్ని సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు తరలించి దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధికి నోచుకోకుండా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే దుబ్బాక నియోజకవర్గానికి సుమారు 40 కోట్ల నిధులు మంజూరు చేయించుకొని దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ఇన్చార్జి మంత్రి కొండా సురేఖల సహ కారంతో రాబోయే రోజుల్లో నియోజకవర్గానికి మరిన్ని నిధులు మంజూరు చేయించు కొని నియోజక వర్గాన్ని అభివృద్ధిలో, అగ్రగామిగా నిలబెడతమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే కొన్ని అమలు చేశామని ఈ నెల 26 నుండి కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు నిరుపేదలకు అందేలా కృషి చేస్తాం. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 60 శాతం టికెట్లు కేటాయించాలి

నవతెలంగాణ-దుబ్బాక

త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు.. బీసీలకు 60 శాతం టికెట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కంకటి నవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా కేంద్రంలో త్వరలో పదివేల మందితో బీసీ గర్జన సభను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని పార్టీల బీసీ నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తొగుట అనిల్,ప్రధాన కార్యదర్శి ప్రభు,బోయ రాములు,పవన్ కుమార్,శ్రీకాంత్, పెంబర్తి భాస్కర్, రాకేష్ పలువురున్నారు.



చదువుకోమన్న తండ్రి, ఉరేసుకున్న కూతురు

- తూప్రాన్ లో పదవ తరగతి విద్యార్థిని సహస్ర ఆత్మహత్య



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని సహస్ర సోమవారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ జి.శివానందం తెలిపారు. పట్టణంలో నివాసముంటున్న గుర్రపుగారి సుధాకర్‌కు ఇద్దరు కూతుర్లున్నారు. పెద్ద కూతురు ఇంటర్ చదువుతుంది. చిన్న కూతురు సహస్ర 10వ తరగతి. చిన్న కూతురుకు మంచిగా చదువుకోమని పాస్ అవ్వాలని తండ్రి సూచించాడు. దీంతో కూతురు సహస్ర నాకు చదువు రావడం లేదని, చదివినా గుర్తు ఉండడం లేదని, నేను పదవ తరగతిలో ఫెయిల్ అవుతానేమో అని భయంతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆ సమయంలో తండ్రి కూలిపనికి వెళ్లగా, తల్లి మమత బీడీల కంపెనీకి వెళ్లి వచ్చి చూసేసరికి తలుపులు మూసి ఉండడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూస్తే బెడ్ రూమ్లో ఉరేసుకొని సహస్ర కనిపించింది. వెంటనే ఇరుగు పొరుగు వారి సహాయంతో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మరణించినట్లు వైద్యులు చెప్పారు. దీంతో సహస్ర మృతిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ జి.శివానందం తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాంగ్రెస్

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పలు అభివృద్ధి పనులను భూమి పూజ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు పూర్తిగా అభివృద్ధిలో కుంటుపడటం జరిగిందన్నారు. మిరుదొడ్డి మండలం అల్వాల, చెప్యాల, మల్లుపల్లి గ్రామాల్లో సిసి రోడ్లతో పాటు మురికి కాలువల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశం, నాయకులు భూపాల్ గౌడ్, కిష్టయ్య, సిద్ధి భూపతి గౌడ్, గుట్టల్, సత్యనారాయణ, రాజు, కన్నా రెడ్డి, లావణ్య, ఎల్లేష్ ,బిక్షపతి, యాదగిరి, నరేష్, కరుణాకర్ పలువురు పాల్గొన్నారు.

తొగుట ఉచిత పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని

ఉచిత పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి.



నవతెలంగాణ-తొగుట

గోపాలమిత్ర సేవలను ఉచిత పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని పశువైద్యులు డాక్టర్ రమేష్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలో పశుగణాభివృద్ధి సంఘం, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా గోపాలమిత్రుల సహకారంతో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 6 పశువులకు గర్భధారణ టీకాలు, 4 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు,16 పశువులకు సాధారణ చికిత్సలు, 27 దూడలకు నట్టల నివారణ మందులు అందించామన్నారు. గోపాలమిత్ర సేవలను, ఉచిత పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఎఫ్ పీ సి చైర్మన్ జీడిపల్లి రాంరెడ్డి, విఏ శ్రీనివాస్, పురుషోత్తం, గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్ గౌడ్, గోపాల మిత్ర వాజీ, పాడి రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దాతల సహకారంతో సపాయి కార్మికుడు అంత్యక్రియలు



నవతెలంగాణ- రాయపోల్

రాయపోల్ మండల కేంద్రానికి చెందిన సఫాయి కార్మికుడు దయ్యాల నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మృతుని అంత్యక్రియల గ్రామస్తులు చందాలు వేసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ రూ.10 వేలు, మాజీ వార్డు సభ్యులు రూ.5 వేలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్తుగారి కిష్టారెడ్డి రూ. 2 వేలు, గ్రామానికి చెందిన పలువురు తమరికి తోచిన సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.సఫాయి కార్మికుడిగా సేవలందించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నిరంతరం కృషిచేసిన మృతుడు నర్సయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. ఇంకా ఎవరైనా సహాయం చేయాలనుకునేవారు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరిగేషన్ డీఈఈఏ విద్యాసాగర్ పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్



ప్రభుత్వ భూమిని అక్రమంగా అమ్ముకుంటున్న అవినీతి అధికారి ఇరిగేషన్ డి ఈ ఈ. విద్యాసాగర్ పై చర్యలు తీసుకోవాలని రైతు తిరుపతి డిమాండ్ చేశారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బైతి తిరుపతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. మల్లన్నసాగర్ కాల్వ కోసం చేపట్టిన భూసేకరణలో అవినీతి అక్రమాలకు పాల్పడిన విద్యాసాగర్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి కోరారు. డిఈఈ విద్యాసాగర్ మద్దతుతో ప్రభుత్వ భూమిని అక్రమంగా సాగు చేస్తున్న బట్ట కనకయ్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోగలరని రైతు బైతి తిరుపతి కోరారు. రెండు రోజుల క్రితం సిద్దిపేట రూరల్ తహసీల్దార్‌కు, సిద్దిపేట ఆర్డీవోకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ విభాగం) అధికారికి, ఇరిగేషన్ ఎస్ఈకి ఫిర్యాదు చేశానని రైతు తిరుపతి తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ..



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామంలోని ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ అన్నాడి సత్యనారాయణ రెడ్డి తన స్వంత ఖర్చులతో సమకూర్చిన రూ.16 వేల విలువైన క్రీడా దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల బోధన సిబ్బంది,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు హాజరయ్యారు.

మద్యం సేవించి వాహనాలు నడపవద్దు.

30మందికి రూ.17వేలు జరిమానా.
గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి.



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. సోమవారం మద్యం సేవించి వాహనాలు నడిపిన 30 మందికి జరిమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. వాహనదారుడు కోల్పోతున్నారన్నారు. గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 30 మందికి రూ.17 వేలు జరిమానా విధించామన్నారు.సిబ్బందితో గత కొన్ని రోజుల గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాలలో వాహనాలు తనిఖీ నిర్వహించామన్నారు. 30 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా బ్రీత్ ఎనలైజర్ తో నిర్ధారణ చేశామన్నారు. గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి ప్రియాంక ముందు హాజరుపరచగా విచారణ చేసి 30 మందికి రూ.17 వేలు జరిమాన విధించారన్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి



నవతెలంగాణ -దౌల్తాబాద్

వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలంటే రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం గొడుగు పల్లి గ్రామంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట కమిషనర్ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు యువకులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శనిగరం గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి కథల పోటీలను గతంలో నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. పాఠశాలలో 128 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొనగా మొదటి స్థానంలో నిలిచిన పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.101/- చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన ఐదుగురు విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతి, మిగతా విద్యార్థులందరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే లైబ్రరీకి 50 కథల పుస్తకాలను ప్రధానోపాధ్యాయురాలు ఎం.సరళకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి భేతి భాస్కర్, మండల విద్యాధికారి రాళ్ళబండి పద్మయ్య, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు, కోశాధికారి గుజ్జ అశోక్‌కుమార్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ అధ్యక్షులుగా ఒలపు నారాయణ.



నవతెలంగాణ-తొగుట

కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ అధ్యక్షులుగా ఒలపు నారాయణ మండల పార్టీ ఉపాధ్యక్షులు అనిల్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో గ్రామ కమిటీ నూతన అధ్యక్షులుగా ఓలపు సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ ఓలపు నారాయణ మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజలోకి తీసికెళ్ళి పార్టీ బోలోపోతానికి కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెజ్జనబోయినా రాములు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వడ్డే కిష్టయ్య, పంది రాజు, మహ్మద్ షఫీ, స్వామి చరణ్, బాలకృష్ణ, నాయకులు మిద్దె లక్ష్మణ్, నర్సింలు, కాలేపు శేఖర్, తిపరమైన స్వామి, పిట్ల స్వామి, కార్యకర్తలు, తదితరాలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులుపై దాడి పట్ల నిరసన



నవ తెలంగాణ -వెల్దుర్తి

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు తంబాలపల్లి రాములు పాఠశాల విధుల్లో ఉన్నప్పుడు దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని మాసాయిపేట మండలంలోని జెడ్పీహెచ్ఎస్, కొప్పు లపల్లి గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీ లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. వీధుల్లో ఉన్న సిబ్బంది పై దాడి చేయడం సమంజసం కాదన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృత్తం కాకూడదంటే దోషులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పోలు శ్రీనివాస్ తండ్రి పోలు శంకరయ్య ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, పార్టీ శ్రేణులు సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని తమ ప్రగఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముంజ శివసాయిగౌడ్, నాయకులు చెప్యాల రవీందర్, తదితరులు ఉన్నారు. అలాగే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి, వేల్పుల నారాయణ పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల కేంద్రమైన కౌడిపల్లిలోని వివిధ కారణాలవల్ల మృతి చెందిన కుటుంబాలను జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ సుహాసిరెడ్డి సోమవారం పరామర్శించారు. పల్లె బిక్షపతి కుమారుడు కృష్ణ ఇటీవల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలను ఓదారుస్తూ తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిషోర్ గౌడ్, జక్కి, తదితరు పాల్గొన్నారు.

బివి రాఘవులును కలిసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్.



సిద్దిపేట జిల్లా కేంద్రంలో కార్మిక కర్షక భవన్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులును సిద్దిపేట జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, రాష్ట్ర కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు పద్మశ్రీని కూడా కలిసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని విన్నవించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించి ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పొన్నమల్ల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల రాజమల్లు రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ చైర్మన్ పుల్లగుర్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఒక్కరూట్రాఫిక్ రూల్స్ పాటించాలి

-గజ్వేల్ ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్
నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యాలు చేరాలని ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్ అన్నారు.సోమవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గజ్వేల్ సిబ్బందితో కలిసి గజ్వేల్ పట్టణం ఇందిరాపార్క్ టీ జంక్షన్ వద్ద యువకులకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు నిబంధనలను పాటించాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు.వాహనం నడిపేటప్పుడు వాహనకు సంబంధించిన డాక్యుమెంట్స్ డ్రైవింగ్ లైసెన్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. రాంగ్ గ్రూప్లో డ్రైవింగ్ చేయడం వల్ల ఎంతోమంది ప్రమాదాల గురవుతున్నారని పేర్కొన్నారు. కిలోమీటర్ దూరంలో యూటర్న్ ఉన్న అక్కడి నుండే మల్లాలి తప్ప, రాంగ్ రూట్లో వెళ్లకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

